RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

సంపుటి : 18 | సంచిక : 190 | Vol : 18 | Issue : 190

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, శుక్రవారం 25 సెప్టెంబర్ 2026
Warangal, Friday 25 September 2026


పేజీలు : 08 | వెల రూ : 4-00
Pages : 08 | Price : 4-00

www.epaper.peoplesdairynews.com
www.peoplesdairynews.com

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, Nizamabad & TG All Districts

WANTED
పీపుల్స్ డైరీ
దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సెంటర్లు
◆ హనుమకొండ ◆ కరీంనగర్
◆ భూపాలపల్లి ◆ పెద్దపల్లి/రామగుండం
◆ జనగామ ◆ మహబూబాబాద్
◆ హైదరాబాద్ ◆ నిజామాబాద్
Cell : 9493019044
9618509859

## తెలుగు కుబేరుల కోట
# హైదరాబాద్



- ధనవంతుల సంపదలో 93 శాతం భాగ్యనగరం నుంచే
- తెలుగు రాష్ట్రాల సంపన్నుల జాబితా..
- లిస్టులో ఏపీ, తెలంగాణలో 134 మంది

### ధనవంతుల జాబితాలో దేశంలో నాలుగో స్థానంలో హైదరాబాద్

**పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ :** తెలుగు రాష్ట్రాల్లోని అత్యంత సంపన్నులు హైదరాబాద్ నుంచే ఎక్కువగా ఉన్నారు. వీ3వీ హురున్ ఇండియా రిచ్ లిస్ట్–2026 ప్రకారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ధనవంతుల మొత్తం సంపదలో ఏకంగా 93.2 శాతం హైదరాబాద్‌లో నివసిస్తున్న సంపన్నులదే. హైదరాబాద్‌కు చెందిన 114 మంది జాబితాలో చోటు దక్కించుకోగా.. వీరి మొత్తం సంపద రూ.10,03,800 కోట్లుగా ఉంది. తెలుగు రాష్ట్రాలు రెండింటినీ కలిపి కనీసం రూ.1000 కోట్ల సంపద కలిగిన (మిగతా 2లో...)

## నాలుగో సారి అధికారం కోసం ఇప్పటి నుంచే మోడీ అలర్ట్?

| సరికొత్త వ్యూహాల దిశగా అడుగులు | కొత్త మిత్రులను కలుపుకునేందుకు స్కెచ్‌లు |
|---|---|

- విపక్ష కూటమిలో చీలికలపై ఫోకస్
- డీలిమిటేషన్ కేంద్రంగా కదపనున్న పావులు
- జెన్‌జీ ఉద్యమం సైతం రేపిన భవిష్యత్ గుబులు
- దక్షిణాది రాష్ట్రాలకు హామీలతో ముందుకు....

# టార్గెట్ 4.0



**పీపుల్స్‌డైరీ–పొలిటికల్ బ్యూరో :** జాతీయ రాజకీయాల్లో మరోసారి కొత్త సమీకరణాలకు తెరలేస్తోంది. డీలిమిటేషన్ వ్యవహా రాన్ని కేంద్రంగా చేసుకుని బీజేపీ నాయకత్వం రాజకీయ వ్యూహాలకు పదును పెడుతున్నట్లు కనిపిస్తోంది. దూకుడు రాజకీయాలకు బదులుగా మిత్రపక్షాలు, తటస్థ పార్టీలు, విపక్ష కూటమిలోని అసంతృప్త వర్గాలతో సంప్రదింపులు జరిపే దిశగా అడుగులు పడుతున్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా ఇప్పటి నుంచే పార్లమెంటరీ సంఖ్యా బలాన్ని పటిష్ఠం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

2026 వర్షాకాల సమావేశాలు ముగిసి 40 రోజులకు పైగా గడిచినా పార్లమెంట్ సమావేశాలకు ఇంకా అధికారికంగా ప్రోరోగ్ జరగకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ అంశాలపై ప్రభుత్వం మరోసారి ముందుకు వెళ్లేం దుకు ఈ వెసులుబాటును ఉంచుకుందన్న విశ్లేషణలు ఉన్నాయి. వర్షాకాల సమావేశాలు ముగిసిన వెంటనే ప్రత్యేక సమావేశం నిర్వహించే అవకాశంపై కూడా అప్పట్లో వార్తలు వచ్చాయి.

**దక్షిణాదికి హామీ.. బిల్లుకు బలం?**

డీలిమిటేషన్‌పై దక్షిణాది ఆందోళ నలను తగ్గించేందుకు కేంద్రం ప్రతిపాదిస్తున్న (మిగతా 2లో...)



## డాక్యుమెంట్ రైటర్లదే
# రాజ్యం..!

### హన్మకొండ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో వసూళ్లపర్వం

| డాక్యుమెంట్ రైటర్లకు అధికారుల అండదండలు? | అవినీతికి అడ్డాగా కార్యాలయం |
|---|---|

- ఫైళ్లకు ఫాస్ట్‌ట్రాక్ రేట్లు ఫిక్స్...
- సామాన్యుడికి తిప్పలు.. దళారి జేబుల్లోకి కాసులు...

2వ పేజీలో..



## పర్యాటకానికి
# కొత్తబాట

- ఆదాయమార్గాల అన్వేషణ దిశగా...
- సరికొత్త ప్రణాళికలపై నజర్...
- తెలంగాణ బ్రాండ్ ప్రపంచానికి తెలిసేలా చర్యలు
- అధికారులకు మంత్రుల కీలక దిశానిర్దేశం

**పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ :** తెలంగాణలో పర్యాటక రంగాన్ని ప్రపంచ వ్యాప్తంగా అందరి దృష్టి ఆకర్షించేలా తీర్చి దిద్దటం కోసం పర్యాటక శాఖ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తుంది. తెలంగాణలో ఉన్న పర్యాటాక ప్రాంతా లను, చారిత్రక కట్టడాలను, ఎకో టూరిజం ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసి, రాష్ట్రాన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు.

పర్యాటక అభివృద్ధి అంటే కేవలం పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయడం మాత్రమే కాదని, తెలంగాణ బ్రాండ్‌ను ప్రపంచానికి పరిచయం చేయడం కూడా అందులో భాగమేనని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ (మిగతా 2లో...)

2వ పేజీలో..


## పండుగల వేళ
# భారీ ఊరట

- వంట నూనెల ధరలపై కేంద్రం కీలక నిర్ణయం!
- నూనెలపై దిగుమతి సుంకాల తగ్గింపు

## శబరిమల అయ్యప్ప స్వామి
# కిరీటం మాయం!

### నకిలీ కిరీటం ప్రత్యక్షం

2లో




# ఖైరతాబాద్ ఉప ఎన్నిక ఖాయం

- సుప్రీం కోర్టులో దానం నాగేందర్‌కు బిగ్ షాక్
- అనర్హత పడింది... మళ్లీ ఎన్నికలకు వెళ్లండి
- హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీం



**పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ :** దానం నాగేందర్‌కు సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ ఫిరాయింపుల కేసులో ఇటీవల ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా దానంపై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేయగా.. ఆయన సుప్రీంను ఆశ్రయించారు. ఆ పిటిషన్ ఇవాళ విచారణకు రాగా.. సుప్రీం కోర్టులో ఆయనకు షాక్ తగిలింది. హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టు సమర్థించింది. వ్యక్తిగతంగా వేరే పార్టీలో చేరితో తప్పు కాదని.. పదవితో పాటే చేరితే పార్టీ ఫిరాయింపుల కిందకే వస్తుందని సుప్రీం స్పష్టం చేసింది. అనర్హతపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ మళ్లీ ఎన్నికలకు వెళ్లండని దానంకు సూచించింది. అనంతరం పిటిషన్‌ను కొట్టేసింది. దీంతో ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక అనివార్యమైంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన తర్వాత ఉప ఎన్నిక షెడ్యూల్ ఖరారు కానుంది.

కాగా, 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. (మిగతా 2లో...)



# టార్గెట్ 4.0



(మొదటి పేజీ తరువాయి)

ఫార్ములాలో అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలను సమానంగా పెంచే అంశం కీలకంగా మారింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఏప్రిల్‌లో లోక్‌సభలో మాట్లాడుతూ.. 543 స్థానాల నుంచి 816కు సభ విస్తరిస్తే దక్షిణాది రాష్ట్రాల స్థానాలు 129 నుంచి 195కు పెరుగుతాయని, మొత్తం సభలో వాటి వాటా దాదాపు 24 శాతంగా కొనసాగుతుందని వివరించారు.

**ఎన్డీఏకు కొత్త మిత్రుల వేట?**

డీలిమిటేషన్ బిల్లు కేవలం రాజ్యాంగ సవరణ ప్రక్రియగా కాకుండా.. భవిష్యత్ రాజకీయ సమీకరణాలకు వేదికగా మారుతోందన్నది తాజా చర్చ. ఎన్డీఏలో ఇప్పటికే ఉన్న భాగస్వాములతో పాటు కాంగ్రెస్‌తో ప్రత్యక్షంగా లేని ప్రాంతీయ పార్టీలతోనూ బీజేపీ సంబంధాలను బలోపేతం చేసుకోవాలన్న ప్రయత్నాలు జరుగుతున్నట్లు రాజకీయ విశ్లేషణలు చెబుతున్నాయి. మహారాష్ట్రలో ఎన్సీపీ (శరద్ పవార్) విషయంలో ఇలాంటి చర్చలు మరింత ఊపందుకున్నాయి. ఎన్సీపీ రెండు వర్గాలు తిరిగి ఒక్కటై ఎన్డీఏలోకి రావాలన్న ప్రతిపాదనపై బీజేపీ నుంచి చర్చలు జరిగినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఎన్సీపీ (ఎస్పీ) మాత్రం భవిష్యత్ ఎన్డీఏ మద్దతుపై వచ్చిన ఊహాగానాలను ఖండించింది.

**జెన్‌జీ ఉద్యమం తర్వాత మారిన లెక్కలు**

ఇటీవల ఢిల్లీలో జరిగిన యువత ఉద్యమం, విద్యా వ్యవస్థపై ఆందోళనలు కేంద్ర ప్రభుత్వానికి రాజకీయంగా మరో పరీక్షగా మారాయి. జంతర్ మంతర్ కేంద్రంగా సాగిన యువత నిరసనల నేపథ్యంలో అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జూలై 25న రాజీనామా చేశారు. ఆ పరిణామం తర్వాత యువత, ప్రాంతీయ పార్టీలు, మిత్రపక్షాల స్పందనలను బీజేపీ నాయకత్వం మరింత జాగ్రత్తగా పరిశీలిస్తోందన్న విశ్లేషణలు వెలువడ్డాయి. ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని.. ప్రత్యర్థులతో నేరుగా ఢీకొనడం కంటే అవసరమైన చోట సంప్రదింపులు, హామీలు, రాజకీయ సమన్వయానికి ప్రాధాన్యం ఇవ్వాలన్న వ్యూహం ముందుకు వస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**అసెంబ్లీ ఎన్నికలపైనా ఫోకస్**

ఇదే సమయంలో పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఉత్తరప్రదేశ్ వంటి కీలక రాష్ట్రాల్లో వచ్చే ఎన్నికలు బీజేపీకి అత్యంత ప్రాధాన్యమైనవిగా మారాయి. పంజాబ్, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాల ఎన్నికలతో పాటు అనంతరం గుజరాత్ ఎన్నికలు కూడా జాతీయ రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. రాష్ట్రాల వారీగా ఏర్పడే రాజకీయ సమీకరణాలు 2029 లోక్‌సభ ఎన్నికల కూటములపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది.

**సంఖ్యాబలమే అసలు పరీక్ష**

డీలిమిటేషన్ వంటి రాజ్యాంగ సవరణలకు సాధారణ మెజారిటీ సరిపోదు. పార్లమెంట్‌లో ప్రత్యేక మెజారిటీ అవసరం కావడంతో మిత్రపక్షాలతో పాటు ఇతర పార్టీల మద్దతు కూడా కీలకంగా మారుతుంది. అందుకే బీజేపీ నాయకత్వం సంఖ్యాబలాన్ని ముందుగానే లెక్కిస్తూ.. వివిధ ప్రాంతీయ పార్టీలతో సంప్రదింపులు సాగిస్తోందన్న చర్చకు ప్రాధాన్యం పెరిగింది. ఇప్పటికే డీలిమిటేషన్ బిల్లుపై ఎన్సీపీ (ఎస్పీ) వంటి పార్టీలు షరతులతో మద్దతు సంకేతాలు ఇవ్వగా.. డీఎంకే తుది బిల్లు వచ్చిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని ప్రకటించింది. దీంతో విపక్ష కూటమిలో కూడా డీలిమిటేషన్‌పై ఒకే స్వరం కొనసాగుతుందా? అన్నది కీలక ప్రశ్నగా మారింది.

**టార్గెట్ 2029**

మొత్తంగా చూస్తే.. డీలిమిటేషన్ అంశం చుట్టూ కేవలం సీట్ల పునర్విభజన రాజకీయమే కాకుండా.. భవిష్యత్ కూటముల రాజకీయానికి కూడా బీజం పడుతున్నట్లు కనిపిస్తోంది. దక్షిణాది ఆందోళనలను తగ్గించడం, ప్రాంతీయ పార్టీలతో చర్చలు జరపడం, ఎన్డీఏ పరిధిని విస్తరించే అవకాశాలను పరిశీలించడం వంటి అంశాలు ఒకేసారి తెరపైకి వచ్చాయి. 2029 లోక్‌సభ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ.. ఇప్పటి నుంచే రాజకీయ మిత్రబంధాలపై కసరత్తు మొదలైన సంకేతాలు కనిపిస్తున్నాయి. డీలిమిటేషన్ బిల్లు ఈ రాజకీయ సమీకరణాలకు ఎంతవరకు వేదికగా మారుతుంది? కొత్త మిత్రులు ఎవరు? విపక్ష కూటమిలో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయి? అన్నదే ఇప్పుడు ఢిల్లీలో హాట్‌టాపిక్‌గా మారింది.

# తెలుగు కుబేరుల కోట హైదరాబాద్...

(మొదటి పేజీ తరువాయి)

వారు 134 మంది ఉన్నారు. వీరి మొత్తం సంపద రూ.10,77,100 కోట్లు. ఇందులో తెలంగాణకు చెందిన 120 మంది వద్ద రూ.10,27,100 కోట్ల సంపద ఉండగా.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 14 మంది వద్ద రూ.50 వేల కోట్ల సంపద ఉంది. ఫార్మా రంగంతో పాటు డేటా సెంటర్లు, ఏఐ, బయోటెక్, గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్ రంగాలకు చెందిన వారు సంపన్నుల జాబితాలో చోటు దక్కించుకున్నారు.

దేశంలోనే అత్యంత సంపన్నుల జాబితాలో హైదరాబాద్‌కు చెందిన ఏడుగురు టాప్-100లో చోటు దక్కించుకున్నారు. నగరంలో 26 మంది బిలియనీర్లు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. ధనవంతుల జాబితాలో హైదరాబాద్ దేశంలో ముంబై, న్యూఢిల్లీ, బెంగళూరు తర్వాత నాలుగో స్థానంలో ఉండగా.. మొత్తం సంపద పరంగా ఐదో స్థానంలో ఉంది. హైదరాబాద్ నగరం నుంచి అత్యంత సంపన్నుడిగా దివీస్ ల్యాబొరేటరీస్‌కు చెందిన మురళీ దివి కుటుంబం నిలిచింది. రూ.1,25,400 కోట్ల సంపదతో జాతీయ స్థాయిలో 13వ స్థానంలో ఉన్నారు. అనంతరం మేఘాకు చెందిన పి.పిచ్చిరెడ్డి రూ.53,100 కోట్లతో 52వ స్థానంలో, పీవీ కృష్ణారెడ్డి రూ.52,100 కోట్లతో 54వ స్థానంలో ఉన్నారు. జ్‌తీశ్రీూ డేటాసెంటర్స్‌కు చెందిన శ్రీధర్ పిన్నపు రెడ్డి, కుటుంబం రూ.46,100 కోట్లతో 62వ స్థానంలో, అరబిందో ఫార్మాకు చెందిన పీవీ రాంప్రసాద్ రెడ్డి రూ.39,900 కోట్లతో 67వ స్థానంలో ఉన్నారు. హెటెరో ల్యాబ్స్‌కు చెందిన బి.పార్థసారథి రెడ్డి కుటుంబం రూ.39,400 కోట్లతో 70వ స్థానంలో, ప్రీమియర్ ఎనర్జీస్‌కు చెందిన సురేందర్ పాల్ సింగ్ సలూజా, కుటుంబం రూ.35,200 కోట్లతో 91వ స్థానంలో ఉన్నారు. ఈ ఏడుగురి సంపద కలిపి రూ.3,91,200 కోట్లు.

హైదరాబాద్ సంపన్నుల్లో చాలా మంది ఫార్మాస్యూటికల్స్ రంగానికి చెందినవారే. మురళీ దివి, పీవీ రాంప్రసాద్ రెడ్డి, బి.పార్థసారథి రెడ్డి కుటుంబాల సంపద కలిపి రూ.2,04,700 కోట్లుగా ఉంది. మేఘా ప్రమోటర్లు పిచ్చిరెడ్డి, పీవీ కృష్ణారెడ్డిల సంపద మరో రూ.1,05,200 కోట్లుగా ఉంది. మహిమా దాట్ల కుటుంబం రూ.25,200 కోట్లు, భారత్ బయోటెక్‌కు చెందిన కృష్ణమూర్తి ఎల్ల కుటుంబం రూ.11,000 కోట్ల సంపదతో బయోటెక్ రంగంలో కీలక స్థానంలో ఉన్నాయి. కాగా, హురున్ రిచ్ లిస్ట్‌లో రాష్ట్రాల వారీ వర్గీకరణ ప్రధానంగా వ్యక్తుల నివాసం ఆధారంగా ఉంటుంది. అందువల్ల తెలుగు మూలాలున్న వ్యాపారవేత్తల వ్యాపారాలన్నింటినీ ఆయా రాష్ట్రాల సంపదలో లెక్కించలేదని నివేదిక స్పష్టం చేస్తోంది. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌తో మూలాలున్న పలువురు పారిశ్రామికవేత్తలు హైదరాబాద్‌లో నివసిస్తుండటంతో వారి సంపద తెలంగాణ లెక్కల్లోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో 14 మందే రిచ్ లిస్ట్‌లో చోటు దక్కించుకున్నారు. కడపకు చెందిన షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ ఎన్.విశ్వేశ్వరరెడ్డి కుటుంబం రాష్ట్రంలో అత్యంత సంపన్నులుగా నిలిచినట్లు నివేదిక పేర్కొంది.

# పర్యాటకానికి కొత్తబాట..

(మొదటి పేజీ తరువాయి)

భాగస్వామ్యంతో పెట్టుబడులు, ఉపాధి, ఆదాయ అవకాశాలను పెంచుతూ రాష్ట్ర పర్యాటక రంగాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

గురువారం హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో పర్యాటక, సాంస్కృతిక శాఖల ఉన్నతాధికారులతో భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం పర్యాటక రంగంలో ప్రభుత్వ పెట్టుబడులతో పాటు ప్రైవేట్ భాగస్వామ్యాన్ని విస్తృతం చేయాలని, పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ విధానంలో కొత్త ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని సూచించారు. పర్యాటక శాఖకు చెందిన ఆస్తులను సమర్థంగా వినియోగించుకోవాలన్నారు. భవనాలు ఉన్న ఆస్తులు, ఖాళీ స్థలాలు, పీపీపీ విధానంలో అభివృద్ధి చేయడానికి అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక జాబితా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆదాయాన్ని సమకూర్చే విధంగా ఆస్తులను అభివృద్ధి చేయడంతో పాటు ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించే చర్యలు చేపట్టాలని సూచించారు. తెలంగాణలో టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, హిల్ టూరిజం తదితర విభాగాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని అన్నారు.

రాష్ట్రంలోని చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, ప్రకృతి పర్యాటక ప్రాంతాలను ప్రపంచ పర్యాటక పటంలో నిలిపేలా విస్తృత స్థాయిలో బ్రాండింగ్, మార్కెటింగ్ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్‌కు వచ్చే దేశీయ, విదేశీ పర్యాటకులను రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు ఆకర్షించేలా ప్రత్యేక పర్యాటక సర్క్యూట్లను అభివృద్ధి చేయాలని చెప్పారు. పర్యాటక ప్రాంతాల్లో హోటళ్లు, రిసార్టులు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రైవేట్ రంగాన్ని భాగస్వామ్యం చేయాలని సూచించారు.

పర్యాటక ప్రాజెక్టులకు ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించే విషయంలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. లీజు విధానాలు, ప్రాజెక్టుల ఆర్థిక సాధ్యత, పెట్టుబడిదారుల ఆసక్తి వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి అవసరమైన మార్పులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కొత్త పర్యాటక ప్రాజెక్టుల ద్వారా ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలని సూచించారు.

# శబరిమల అయ్యప్ప స్వామి కిరీటం మాయం!

## నకిలీ కిరీటం ప్రత్యక్షం

పీపుల్స్‌డైరీ-వెబ్‌డెస్క్ : ప్రఖ్యాత పుణ్యక్షేత్రం శబరిమలలో తీవ్ర సంచలనం రేపిన ఘటన వెలుగు చూసింది. భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామివారికి సమర్పించిన విలువైన బంగారు కిరీటం అదృశ్యమైనట్లు ఆలయ స్టాక్ వెరిఫికేషన్‌లో తేలింది. అసలు కిరీటం మాయమై, దాని స్థానంలో అచ్చం అలాగే కనిపించే ఒక నకిలీ కిరీటం ఉండటాన్ని అధికారులు గుర్తించారు. తమిళనాడకు చెందిన చార్టెర్డ్ అకౌంటెంట్లు భక్తితో ఆగస్ట్ 2012లో ఈ బంగారు కిరీటాన్ని స్వామివారికి కానుకగా సమర్పించారు. అప్పట్లో చింగం 1వ తేదీన ఈ కిరీటాన్ని అయ్యప్ప స్వామి విగ్రహానికి అలంకరించి, ఆ తర్వాత స్ట్రాంగ్ రూమ్‌కు భద్రపరిచారు.

అయితే, ప్రస్తుతం హైకోర్టు నియమించిన అమికస్ క్యూరీ జస్టిస్ కేటీ శంకరన్ ఆధ్వర్యంలో శబరిమల స్టోర్‌రూమ్ అలాగే ఆరన్ముల స్ట్రాంగ్ రూమ్‌లో కూలంకషంగా స్టాక్ వెరిఫికేషన్ నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల సమయంలోనే అసలు విషయం బయటపడింది. అసలు కిరీటం బరువు 445.78 గ్రాములు ఉండగా, అందులో 55.72 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ఉంది. అంతేకాకుండా ఆ కిరీటంపై విలువైన రత్నాలు కూడా పొందుపరిచి ఉన్నాయి. కానీ, ప్రస్తుతం స్టోర్‌రూమ్‌లో దొరికిన నకిలీ కిరీటం కేవలం 240 గ్రాముల బరువు మాత్రమే ఉండటంతో పాటు, దానిలో బంగారపు జాడ లేకపోవడం గమనార్హం.

కేవలం కిరీటం మాత్రమే కాకుండా, ఆరన్ముల స్ట్రాంగ్ రూమ్‌లో చేపట్టిన తనిఖీల సమయంలో నాలుగు సవర్ల బంగారు గొలుసు కూడా మాయమైనట్లు అధికారులు గుర్తించారు. ఆలయ నియమాల ప్రకారం భక్తులు సమర్పించే అత్యంత విలువైన కానుకలను మొదట రికార్డు పుస్తకంలో నమోదు చేసి, ఆ తర్వాత వాటిని ఆరన్ముల స్ట్రాంగ్ రూమ్‌కు సురక్షితంగా తరలించాల్సి ఉంటుంది. కానీ ఈ వ్యవహారంలో రికార్డులకు, భద్రతకు మధ్య ఎక్కడో భారీ లోపాలు జరిగినట్లు స్పష్టమవుతోంది. అంతటి పవిత్రమైన స్థలంలో ఇంత పెద్ద ఎత్తున విలువైన వస్తువులు మాయమవడం వెనుక ఎవరి హస్తం ఉందనే కోణంలో ఆరా తీస్తున్నారు.



# ఖైరతాబాద్ ఉప ఎన్నిక ఖాయం

(మొదటి పేజీ తరువాయి)

2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. అప్పటికి ఆయన ఎమ్మెల్యేగా కొనసాగుతుండటంతో.. ఒక పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి మరో పార్టీ అభ్యర్థిగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ కింద పార్టీ ఫిరాయింపుగా పరిగణించాలంటూ అనర్హత పిటిషన్లు దాఖలయ్యాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా అసెంబ్లీ స్పీకర్ వద్ద దానం నాగేందర్‌పై అనర్హత పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ 2026 మార్చి 11న పిటిషన్లను కొట్టివేశారు. దానం నాగేందర్ బీఆర్ఎస్ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నట్లు నిర్ధారించడానికి తగిన ఆధారాలు లేవని స్పీకర్ అభిప్రాయపడ్డారు.

స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ పాడి కౌశిక్‌రెడ్డి, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు ధర్మాసనం ఆగస్టు 21న తీర్పును రిజర్వు చేసింది. సెప్టెంబర్ 18న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌తో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు వెలువరించింది. స్పీకర్ ఇచ్చిన ఉత్తర్వులను పక్కనపెట్టి దానం నాగేందర్‌ను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించింది. అంతేకాదు.. ఈ అనర్హత 2024 ఏప్రిల్ 23 నుంచి అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు కూడా హైకోర్టు ప్రకటించింది. హైకోర్టు తీర్పును వెంటనే అమలు చేయకుండా నిలిపివేసి సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు అవకాశం ఇవ్వాలన్న దానం నాగేందర్ తరఫు అభ్యర్థనను కూడా ధర్మాసనం అంగీకరించలేదు. తీర్పు ప్రతిని అసెంబ్లీ స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శి, ఎన్నికల సంఘానికి పంపించాలని ఆదేశించింది.

హైకోర్టు తీర్పు తర్వాత దానం నాగేందర్ సెప్టెంబర్ 19న సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు తీర్పును నిలిపివేయాలని కోరారు. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ అత్యవసర విచారణ కోరగా.. సుప్రీంకోర్టు విచారణకు అంగీకరించింది. ఈ కేసులో బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇప్పటికే కేవియట్లు దాఖలు చేశారు. తాజాగా.. ఇవాళ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు.. హైకోర్టు తీర్పును సమర్థిస్తూ దానం నాగేందర్ పిటిషన్‌ను కొట్టేసింది. దీంతో ఖైరతాబాద్‌లో త్వరలోనే ఉప ఎన్నిక రానుంది.

# డాక్యుమెంట్ రైటర్లదే రాజ్యం?

- హన్మకొండ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో వసూళ్లపర్వం
- డాక్యుమెంట్ రైటర్లకు అధికారుల అండదండలు?
- అవినీతికి అడ్డాగా కార్యాలయం
- ఫైళ్లకు ఫాస్ట్‌ట్రాక్ రేట్లు ఫిక్స్...
- సామాన్యుడికి తిప్పలు.. దళారి జేబుల్లోకి కాసులు...
- అధికారిక ఫీజుకంటే రూ.10వేల వరకు అదనంగా వసూలు



పీపుల్స్‌డైరీ-హనుమకొండ : హన్మకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్ల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. సామాన్య ప్రజలు నేరుగా వెళ్తే ఫైళ్లను పక్కకు పెడుతూ డాక్యుమెంట్ రైటర్ల ద్వారా వచ్చిన ఫైళ్లకే అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో రోజుకు లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయని బాధితులు వాపోతున్నారు. రోజూ వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు జరిగే ఈ కార్యాలయంలో సొంతంగా డాక్యుమెంట్ తయారు చేసుకుని నేరుగా వెళ్తే సంతకం సరిగా లేదని, ఈసీలో తేడా ఉందంటూ చిన్న తప్పులు చూపి రోజుల తరబడి తిప్పుకుంటున్నారు. అదే ఫైల్ డాక్యుమెంట్ రైటర్ చేతిలో ఉంటే మాత్రం ఎలాంటి అభ్యంతరం లేకుండా నిమిషాల్లో పని పూర్తవుతోందని బాధితులు ఆరోపిస్తున్నారు.

ప్రతి రిజిస్ట్రేషన్ కు అధికారిక ఫీజు కాకుండా రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక దస్తావేజులో ఏదైనా చిన్న సమస్య ఉన్నా స్థలానికి సంబంధించి సాంకేతిక అంశం ఉన్నా చాలు, దాన్ని ఆసరాగా చేసుకుని వేల రూపాయల నుంచి లక్షల్లో డిమాండ్ చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆ సమస్యను తాము చూసుకుంటామంటూ భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారని తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు దాడులు చేసి అవినీతి అధికారులను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుంటున్నా, హన్మకొండ కార్యాలయంలో తీరు మారడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు...


# పండుగల వేళ భారీ ఊరట..

- వంట నూనెల ధరలపై కేంద్రం కీలక నిర్ణయం!
- నూనెలపై దిగుమతి సుంకాల తగ్గింపు

**పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ:** పండుగ సీజన్‌కు ముందు వంట నూనెల ధరలను అదుపులో ఉంచేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పామాయిల్, సోయాబీన్ ఆయిల్, పొద్దుతిరుగుడు నూనె సహా ముడి, శుద్ధి చేసిన వంట నూనెలపై దిగుమతి సుంకాలను తగ్గించింది. కొత్త సుంక రేట్లు సెప్టెంబర్ 24 అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చాయి. తాజా నిర్ణయం ప్రకారం.. ముడి సోయాబీన్ నూనె, ముడి పామాయిల్‌పై ప్రాథమిక కస్టమ్స్ సుంకం 10 శాతం నుంచి 5 శాతానికి తగ్గింది. ముడి పొద్దుతిరుగుడు నూనెపై 10 శాతం నుంచి సున్నాకు తగ్గించారు. ఇక శుద్ధి చేసిన సోయాబీన్ నూనె, పామాయిల్‌పై దిగుమతి సుంకం 32.5 శాతం నుంచి 27.5 శాతానికి తగ్గింది. శుద్ధి చేసిన పొద్దుతిరుగుడు నూనెపై సుంకం 32.5 శాతం నుంచి 22.5 శాతానికి తగ్గించారు. దిగుమతి సుంకాలు తగ్గడంతో విదేశాల నుంచి నూనెలను దిగుమతి చేసుకునే ఖర్చు తగ్గే అవకాశం ఉంది. ఈ ప్రయోజనం దిగుమతిదారులు, రిఫైనర్లు, డిస్ట్రిబ్యూటర్లు, రిటైలర్ల వరకు సరఫరా గొలుసులో పూర్తిగా బదిలీ అయితే వినియోగదారులకు కూడా ధరల పరంగా కొంత ఊరట లభించనుంది. గతంలోనూ ప్రభుత్వం దిగుమతి సుంకాలను తగ్గించినప్పుడు ఆ ప్రయోజనం వినియోగదారులకు చేరేలా చర్యలు తీసుకుంది. పండుగల సమయంలో వంట నూనెలకు డిమాండ్ సాధారణంగా పెరుగుతుంది. ఈ నేపథ్యంలో తాజా సుంక తగ్గింపు దేశీయ మార్కెట్లో సరఫరా, ధరలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే అంతర్జాతీయ నూనె ధరలు, రూపాయి మారకం విలువ, దిగుమతి వ్యయం వంటి అంశాలు కూడా రిటైల్ ధరలను ప్రభావితం చేస్తాయి.

# ఆపదలో ఉన్న కుటుంబానికి ఆసరా..

స్నేహబంధంతో మానవత్వాన్ని చాటుకున్న పూర్వ విద్యార్థులు




**గణపురం, సెప్టెంబర్ 24 (పీపుల్స్‌డైరీ) :** గణపురం జెడ్పీఎస్ఎస్ హైస్కూల్‌కు చెందిన 2007-08 బ్యాచ్ స్నేహితులు తమ స్నేహబంధంతో మానవత్వాన్ని చాటుకున్నారు. 2007-28 బ్యాచ్ కి చెందిన మిత్రుడు, భాగిర్తిపేటకు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన పెండ్యాల అశోక్ కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతూ ఇటీవల మృతి చెందారు. ఈ విషాద వార్తను తోటి స్నేహితుల ద్వారా తెలుసుకున్న మిత్రబృందం తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే స్పందించిన మిత్రబృందం, మృతుడు అశోక్ నివాసమైన బాగిర్తి పేటకు వెళ్లి, అతని కుటుంబ సభ్యులను పరామర్శించి తమ వంతుగా ఆర్థిక సాయాన్ని అందజేశారు. చిన్ననాటి స్నేహాన్ని మరువక కష్టకాలంలో అండగా నిలిచిన గణపురం జెడ్పీఎస్ఎస్ 2007-28 బ్యాచ్ స్నేహితులను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

# అంకంపాలెం గిరిజన బాలికల కళాశాలలో ఇంటర్ ప్రవేశాలు

**గిరిజన విద్యార్థినులకు అవకాశం** **సెప్టెంబర్ 26 వరకు దరఖాస్తుల స్వీకరణ**

**దమ్మపేట, సెప్టెంబర్ 24(పీపుల్స్ డైరీ) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం అంకంపాలెంలో ఉన్న తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. గిరిజన ప్రాంతాలకు చెందిన అర్హత కలిగిన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల అధికారులు సూచించారు. ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశం పొందేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థినులు నిర్ణీత గడువులోగా కళాశాలకు హాజరై దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎంపీసీ విభాగం - 3 సీట్లు, సీఈసీ విభాగం- 7 సీట్లు, హెచ్ఈసీ విభాగం - 7 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ప్రవేశాల కోసం దరఖాస్తుల స్వీకరణ సెప్టెంబర్ 24 నుంచి సెప్టెంబర్ 26వ తేదీ వరకు కొనసాగుతుందని కళాశాల యాజమాన్యం తెలిపింది.




అర్హత కలిగిన విద్యార్థినులు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా ముందుగానే కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశాలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం కళాశాల ప్రిన్సిపాల్ షేక్ ఖీజాంబీను 9490957285 నంబర్‌లో సంప్రదించవచ్చని కళాశాల యాజమాన్యం తెలిపింది.

# కాంగ్రెస్ అసమర్థ పాలనతోనే విద్యుత్ సంక్షోభం!

- కేటీపీపీ ఎదుట బీఆర్ఎస్ మహాధర్నా..
- ప్లాంట్‌లోకి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు!
- కేసీఆర్ హయాంలోనే 24 గంటల నాణ్యమైన కరెంట్!
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి..



**భూపాలపల్లి సెప్టెంబర్ 24 పీపుల్స్ డైరీ..** భూపాలపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ విధానాలు, చేతకానితనం వల్లే రాష్ట్రంలో విద్యుత్, సాగునీటి సంక్షోభం ఏర్పడిందని జనగామ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (కేటీపీపీ) సందర్శనకు వచ్చిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ మంత్రులు, సీనియర్ నేతలను పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి ప్లాంట్‌లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో కేటీపీపీ ప్రధాన ద్వారం వద్ద ఉద్రిక్తత నెలకొంది. పోలీసుల తీరును, ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, ఆరూరి రమేష్, శంకర్ నాయక్, ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి తదితరులతో కలిసి కేటీపీపీ ఎదుట బైఠాయించి మహాధర్నా చేపట్టారు. అనంతరం బీఆర్ఎస్ బృందాన్ని సొంత పూచీకత్తుపై ప్లాంట్‌లోకి అనుమతించారు.

### కేసీఆర్ పాలనలో 24 గంటల కరెంట్

ధర్నాలో పల్లా మాట్లాడుతూ.. దేశంలోని 29 రాష్ట్రాల్లో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా తెలంగాణ రైతులకు 24 గంటల ఉచిత, నాణ్యమైన విద్యుత్ అందించిన నాయకుడు కేసీఆర్ అని అన్నారు. ఉమ్మడి పాలనలో కరెంట్ కోతలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో ఆరుగురు రైతులు ప్రాణాలు కోల్పోయారని, తెలంగాణ ఉద్యమమే కరెంట్ పోరాటాల నుంచి పుట్టిందని గుర్తుచేశారు. 2014 నాటికి రాష్ట్రంలో 19 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉండగా, కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్ల పాలనలో ఒక్క రూపాయి ఖర్చు లేకుండా వాటిని 30 లక్షలకు పెంచారని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లలో ఒక్క కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కూడా ఇవ్వలేకపోయిందని విమర్శించారు.

### విద్యుత్ రంగంలో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు

2014 నుంచి 2023 వరకు విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీ వ్యవస్థల కోసం కేసీఆర్ ప్రభుత్వం రూ.లక్ష కోట్లు వెచ్చించిందని పల్లా తెలిపారు. రాష్ట్రం ఏర్పడే నాటికి 5,500 మెగావాట్లుగా ఉన్న స్థాపిత విద్యుత్ సామర్థ్యాన్ని 22,000 మెగావాట్లకు పెంచిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. కేటీపీపీ, భద్రాద్రి, యాదాద్రి పవర్ స్టేషన్లతో పాటు ఎన్టీపీసీలో 1,600 మెగావాట్లు, 5,000 మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. మూడు, నాలుగేళ్లలో భారీ థర్మల్ ప్రాజెక్టులు నిర్మించడంతోపాటు వేల కోట్లతో 400 కేవీ, 132 కేవీ సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి పటిష్టమైన విద్యుత్ నెట్‌వర్క్ నిర్మించామని పేర్కొన్నారు.

### బొగ్గు కొరత పేరుతో ప్లాంట్ల మూసివేత

సింగరేణి సంస్థకు జెన్‌కో విభాగం రూ.52 వేల కోట్ల బకాయిలు ఉండటంతో బొగ్గు సరఫరా నిలిపివేశారని పల్లా ఆరోపించారు. రికార్డుల్లో 40 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు చూపుతున్నా వాస్తవంగా నిల్వలు లేవన్నారు. నాణ్యమైన బొగ్గును ఆంధ్రప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాలకు విక్రయిస్తూ తెలంగాణ ప్రాజెక్టులకు సరఫరా చేయడం లేదని విమర్శించారు. కేటీపీపీకి రోజుకు 5,000 టన్నుల బొగ్గు అవసరం ఉండగా కేవలం 1,500 టన్నులు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. యాదాద్రి, భద్రాద్రి, భూపాలపల్లి ప్లాంట్లలో సగానికిపైగా యూనిట్లను షట్‌డౌన్ చేసి కృత్రిమ విద్యుత్ కొరత సృష్టిస్తున్నారని ఆరోపించారు. తాము వస్తున్నామని తెలిసి రెండు యూనిట్లను నడుపుతున్నట్లు చూపిస్తున్నారని, తమ పర్యటన ముగిసిన తర్వాత మళ్లీ షట్‌డౌన్ పేరుతో మూసివేసే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు.

### కమీషన్లు, రియల్ ఎస్టేట్ దందాల్లో మంత్రులు

మంత్రులు రైతుల సంక్షేమాన్ని పట్టించుకోకుండా దోపిడీలో మునిగిపోయారని పల్లా ఆరోపించారు. విద్యుత్ శాఖ మంత్రి కమీషన్ల వేటలో ఉండగా, ఇన్‌చార్జి మంత్రులు 30, 40 శాతం వాటాల కోసం భూముల పంచాయితీలు, రియల్ ఎస్టేట్ దందాలు చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రికి కూడా రైతులకు 24 గంటల కరెంట్ ఇవ్వడంపై చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రుల కంటే పెద్ద రియల్ ఎస్టేట్ బ్రోకర్లు ఎవరూ లేరని ఎద్దేవా చేశారు.

### గోదావరి నీటిని ఎత్తిపోసే తెలివి లేదు

కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో రిజర్వాయర్లు నిండుతున్నా తెలంగాణలో గోదావరి నిండుగా ప్రవహిస్తున్నా నీటిని ఎత్తిపోసే చర్యలు చేపట్టడం లేదని పల్లా విమర్శించారు. సమ్మక్క సాగర్ వద్ద లక్ష క్యూసెక్కుల నీరు వృథాగా పోతున్నా ఉమ్మడి వరంగల్ మంత్రులు, ఎమ్మెల్యేలు ఒక్కరోజైనా సమీక్ష నిర్వహించారా అని ప్రశ్నించారు. కాళేశ్వరం ఎత్తిపోస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందనే అక్కసుతో దేవాదుల మోటార్లు కూడా నడపడం లేదని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో సమ్మక్క సాగర్ నిర్మాణం, 48 కిలోమీటర్ల టన్నెల్, రిజర్వాయర్ల నిర్మాణం జరిగితే ప్రస్తుత ప్రభుత్వం ఒక్క మీటర్ కాలువ కూడా తవ్వలేదని, ఒక్క తట్టెడు మట్టి తీయలేదని, ఒక్క మోటారు పెట్టలేదని విమర్శించారు. కరెంట్ లేదనే సాకుతో మోటార్లు నడపకుండా పంటలను ఎండబెడుతున్నారని ఆరోపించారు.

### 'చేతకాకపోతే ముక్కు నేలకు రాయండి'

రైతుబంధు ఇవ్వలేదని, రైతుబీమాను అటకెక్కించారని, కాంగ్రెస్ మేనిఫెస్టో హామీలను గాలికొదిలేశారని పల్లా విమర్శించారు. తాము కొత్తగా ఏమీ అడగడం లేదని, గతంలో నిర్మించిన ప్రాజెక్టులను సక్రమంగా నడిపి రైతులకు 24 గంటల కరెంట్, సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. జెన్‌కో బకాయిలుగా ఉన్న రూ.52 వేల కోట్లను వెంటనే చెల్లించి కేటీపీపీ, యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్లకు బొగ్గు సరఫరా పునరుద్ధరించాలని కోరారు. బీఆర్ఎస్ నేతలను బెదిరింపులు, రాళ్లదాడులతో భయపెట్టాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. "ప్రభుత్వం మీ చేతుల్లోనే ఉంది. అక్రమంగా ఏదైనా ఉంటే తేల్చండి.. నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదు. పాలన చేతనైతే విద్యుత్ ప్లాంట్లను నడిపి రైతులకు కరెంట్ ఇవ్వండి.. చేతకాకపోతే సిగ్గుపడి ముక్కు నేలకు రాయండి" అని పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు.

# సెప్టెంబర్ 27న చలో యాదగిరిగుట్ట..ఉద్యమకారుల ఫోరం పిలుపు!

### రేగొండ మండల కేంద్రంలో గోడ పత్రిక విడుదల!



**రేగొండ సెప్టెంబర్ 24 పీపుల్స్ డైరీ..** సెప్టెంబర్ 27న చలో యాదగిరిగుట్ట సభకు రేగొండ మండలం నుండి అదిక సంఖ్యలో ఉద్యమకారులు తరలిరావాలనీ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు పత్తి బుచ్చిరెడ్డి పిలుపునిచ్చారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రం లో ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు పత్తి బుచ్చిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో చలో యాదగిరి గుట్ట 27 ఆదివారం రోజున గోడ పత్రిక విడుదల చేశారు.ఈ సందర్భంగా ఉద్యమకారుల జిల్లా నాయకులు పున్నం రవి మాట్లాడుతూ. ఈ నెల 27 యాదగిరి గుట్ట లో జరిగే సమావేశానికి జిల్లా నుండి ఉద్యమకారులు (యువత విద్యార్థులు మహిళలు కళాకారులు కార్మిక కర్షకులు) తరలి రావాలని ఆయన కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నిక ల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఉద్యమ కారుల న్యాయ-ంమైన డిమాండ్ లు నెరవేర్చాలని కోరారు.తెలంగాణ ఉద్యమ సమయంలో అనేక పోరాటాలు చేశామని గత ప్రభుత్వం ఉద్యమ కారులను పట్టించు కోలేదని ప్రస్తుత ముఖ్యమంత్రి ఉద్యమకారుల డిమాండ్ల పై స్పందించాలని కోరారు..ఈ కార్యక్రమంలో పట్టేం శంకర్, ఐలి శ్రీధర్ గౌడ్, మైస బిక్షపతి,దాసరి తిరుపతి రెడ్డి,మడికంటి ప్రభాకర్,అశోక్ రెడ్డి,జూపాక శ్రీనివాస్, పసుల అశోక్, సంపత్, రామ్ చందర్, సదయ్య, రాసమల్ల వెంకట్, ముదురు కొల్ల సుధాకర్, తూర్పటి మల్లేష్, తదితరులు పాల్గొన్నారు..

# కే టి పి పి ముట్టడి నేపద్యంలో రేగొండ బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

### అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు..



**రేగొండ సెప్టెంబర్ 24 పీపుల్స్ డైరీ..** రేగొండ: కాంగ్రెస్ సర్కార్ విద్యుత్ ఉత్పత్తిపై అవలంబిస్తున్న నిర్లక్ష్యాన్ని, కరెంటు కోతలను నిరసిస్తూ గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని చెల్పూర్ కేటీపీపిని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ రాష్ట్ర బృందం సందర్శిన నేపథ్యంలో భూపాలపల్లి నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోనీ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను ఉదయం నుండే పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. పోలీసుల నిర్బంధంలో కేటీపీపీ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర బృందం కేటీపీపీని వస్తున్న నేపథ్యంలో కేటిపిపి చుట్టూ భారీగా పోలీసు బలగాలను మోహరించారు.ఈ నేపథ్యంలో రేగొండ మండల బి ఆర్ ఎస్ పార్టీకి చెందిన నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారు.ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ నాయకులు మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరనీ రైతుల కోసం బి ఆర్ ఎస్ నాయకులు నిత్యం పోరాటం చేస్తామన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంట్ కోతలు ఎక్కువయ్యాయని అన్నారు.24 గంటల కరెంట్ రాక రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు.కరెంట్ కోతల వల్ల ఇప్పటికే కొంత మంది రైతులు మృతి చెందారు.రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోరుతూ గురువారం చెల్పూర్ జెన్కో ముట్టడికి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి, పిలుపు నిచ్చిన నేపద్యంలో రేగొండ పోలీసులు అక్రమ అరెస్టులు చేయడం అప్రజా స్వామికం అన్నారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, రూపిరెడ్డి పల్లి గ్రామ సర్పంచ్ ముదుతనపల్లి కుమార్, మండల మాజీ కో ఆప్షన్ రియాజ్ పాషా, రూపిరెడ్డి చంద్ర రెడ్డి, రూపిరెడ్డి పల్లి బి ఆర్ ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు పంచగిరి సుధాకర్,మాజీ అధ్యక్షులు సర్వ రవి,గుర్రాల సుమన్ రెడ్డి,రమేష్, గంజి రజినీ కాంత్ , తదితరులు ఉన్నారు..

# తెలంగాణ రాష్ట్రస్థాయి జానపద సాంస్కృతిక జాతర-2026కు దరఖాస్తుల ఆహ్వానం

### దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: 28-09-2026

**ముల్కనూర్, సెప్టెంబర్ 24 (పీపుల్స్ డైరీ):** కరీంనగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్రస్థాయి జానపద సాంస్కృతిక జాతర--2026ను తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ఘనంగా నిర్వహించనున్నట్లు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ,తెలంగాణ జానపద కళలు, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించి భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో ఈ జాతరను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రతిభావంతులైన జానపద కళాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు వేదిక కల్పించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. జానపద పాటలు, జానపద నృత్యాలు, గ్రూప్ సాంగ్స్, ఒగ్గుకథ, ఒగ్గుడోలు, డప్పు నృత్యాలు, బతుకమ్మ ఆటలు, మహిళా కోలాటం, బోనాలు, బుర్రకథ, సింధు యక్షగానం తదితర జానపద కళారూపాలను ప్రదర్శించే కళాకారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జానపద కళలు తెలంగాణ సంస్కృతిలో అంతర్భాగమని, పల్లెల్లో తరతరాలుగా కొనసాగుతున్న కళారూపాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సుభాష్ చంద్రబోస్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని జానపద కళాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఆసక్తి ఉన్న జానపద కళాకారులు 94409 88001 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. జానపద కళాకారులకు తగిన వేదిక కల్పించి తెలంగాణ జానపద కళలు, సంస్కృతిని



ప్రోత్సహించేందుకు దోహదపడుతుందని ఆయన అన్నారు. కార్యక్రమం నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

# ఫ్రీ ప్రైమరీ బోధకులు,ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు

### ఆరు పోస్టులకు అరవై మంది హాజరు..



**రేగొండ సెప్టెంబర్ 24 పీపుల్స్ డైరీ..** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోనీ లింగాల,బాగిర్తి పేట,మడత పల్లి గ్రామ పాఠశాలల్లో ప్రారంభం కానున్న ఫ్రీ ప్రైమరీ తరగతుల కోసం బోధకులు ( ఇన్స్ట్రక్టర్లు,3 ఆయాలు3)పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారి ప్రభాకర్ తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడినా ఆయన మండలంలోని మూడు ప్రాథమిక ,ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఫ్రీ ప్రైమరీ తరగతుల నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరి చేసిన నేపథ్యంలో నియామక ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు .మండల కేంద్రంలో ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించిన ఈ ఇంటర్వ్యూ లో ఎంపిడిఓ వెంకటేశ్వర రావు,సమక్షంలో పారదర్శకంగా నిర్వహించినట్లు ఏం ఈ ఓ తెలిపారు.ఇంటర్వ్యూ అనంతరం నివేదికలను జిల్లా విద్యాశాఖ అధికారులకు పంపించినట్లు పేర్కొన్నారు.తుది ఎంపిక జాబితాను జిల్లా విద్యాశాఖ అధికారి త్వరలో అధికారికంగా ప్రకటిస్తారని అన్నారు.

# ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

### భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ...






**ఆళ్ళపల్లి సెప్టెంబర్ 24(పీపుల్స్ డైరీ) :** మండల వ్యాప్తంగా గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆళ్ళపల్లి ఎస్సై సోమేశ్వర్ తహసీల్దార్ ఉమా రాణి గురువారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై సోమేశ్వర్ తహసీల్దార్ ఉమా రాణి మాట్లాడుతూ, వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నందున ఎవరూ దాటే ప్రయత్నం చేయవద్దని, లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. రైతులు, వ్యవసాయ కూలీలు పొలాల వద్దకు వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, విద్యుత్ స్తంభాలు, పాత భవనాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే తహసీల్దార్ కార్యాలయానికి లేదా స్థానిక పోలీస్ స్టేషన్ కు అధికారులకు సమాచారం అందించాలని కోరారు. వారు తెలిపారు,

# రాకపోకలకు అంతరాయం

### బొల్లెనపల్లి వంతెన వద్ద నీటి ప్రవాహం...స్పందించిన ముల్కనూర్ పోలీసులు



**భీమదేవరపల్లి, సెప్టెంబర్ 24 (పీపుల్స్ డైరీ) :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం బొల్లెనపల్లి గ్రామ వంతెన వద్ద బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షాల కారణంగా నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడింది. వర్షపు నీటితో పెద్దఎత్తున చెత్తాచెదారం కొట్టుకువచ్చి వంతెన కింద పేరుకుపోవడంతో నీటి ప్రవాహం నిలిచిపోయి పొంగిపొర్లింది. దీంతో వాహనాల రాకపోకలకు, స్థానికులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి.సమాచారం అందుకున్న వెంటనే ముల్కనూర్ ఎస్సై రాజు సమయస్ఫూర్తితో స్పందించారు. గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామ పెద్దలతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సహాయంతో వంతెన కింద పేరుకుపోయిన చెత్తాచెదారం, ఇతర అడ్డంకులను తొలగింపజేశారు.దీంతో ప్రస్తుతం వంతెన వద్ద నీటి ప్రవాహం సాఫీగా కొనసాగుతోంది. వాహనాల రాకపోకలు కూడా పునరుద్ధరించబడ్డాయి. సమస్య తీవ్రతను గుర్తించి తక్షణమే స్పందించి పరిష్కరించిన ముల్కనూర్ ఎస్సై రాజు, గ్రామ ప్రజాప్రతినిధుల చర్యలపై బొల్లెనపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# గణపతి నిర్వాహకులకు ఘన సన్మానం





**కోహెడ సెప్టెంబర్ 24 (పీపుల్స్ డైరీ) :** కోహెడ పట్టణ కేంద్రంలో పాతబస్టాండ్ గణపతి నవరత్రోత్సవాల సందర్భంగా ముస్లిం సోదరులచే ఘన సన్మానం. చాలా ఏండ్ల తర్వాత మళ్ళీ ఈ సంవత్సరం గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు.గణపతి విగ్రహ దాత బొమ్మగాని శివకుమార్ గౌడ్,విగ్రహకమిటీమ్యానేజ్మెంట్ గోవిందు వెంకటేశం నేత ను అభినంది, ఎన్నో సంవత్సరాల తర్వాత కోహెడ పాత బస్టాండ్ లో వినాయకుడునీ ప్రతిష్టాపన చేసిన సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపి, షాలువతో సన్మానించిన మహమ్మద్ జాకీర్, మహమ్మద్ ఓవైజ్, గోవిందు రమేష్,నేత, శ్రీహర్ష,రాహుల్ తదితరులు ఉన్నారు

# కట్టు కాలువకు తప్పిన ముప్పు

**సకాలంలో స్పందించిన సర్పంచ్ పోలు స్వరూప-ప్రవీణ్**



**సైదాపూర్ సెప్టెంబర్ 24 ( పీపుల్స్ డైరీ) :** సర్వాయిపేట్ గ్రామపంచాయతీ పరిధిలో తృటిలో పెను ప్రమాదం తప్పింది. కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కొచ్చారు చెరువుకు వరద నీరు పోటెత్తుతోంది. అక్కడి నుంచి కట్టు కాలువ ద్వారా నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. అయితే, కాలువలో అడుగడుగునా చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు, పొదలు పెరిగిపోవడంతో నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. వరద ఉద్ధృతికి కాలువ కట్ట తెగిపోయి ముంపు ప్రమాదం జరిగే పరిస్థితి నెలకొనడంతో స్థానికుల్లో ఆందోళన వ్యక్తమైంది. ప్రమాద తీవ్రతను గమనించిన గ్రామ సర్పంచ్ పోలు స్వరూప-ప్రవీణ్ తక్షణమే స్పందించారు. గ్రామస్థులను సమన్వయం చేసి, వారి సహకారంతో కాలువ వద్దకు చేరుకున్నారు. నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న చెత్తను, పొదలను స్వయంగా శ్రమదానం చేసి యుద్ధప్రాతిపదికన తొలగించారు. దీంతో ప్రవాహానికి అడ్డంకులు తొలగిపోయి, వరద నీరు ఎలాంటి ప్రమాదం లేకుండా ఆకునూర్ చెరువుకు సాఫీగా తరలివెళ్లింది. కాలువకు పొంచి ఉన్న ప్రమాదాన్ని సకాలంలో గుర్తించి, సమయస్ఫూర్తితో అప్రమత్తమై సమస్యను పరిష్కరించిన సర్పంచ్ పోలు స్వరూప-ప్రవీణ్‌ను, ఇందుకు సహకరించిన యువతను గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు.

# జలకళ సంతరించుకున్న రాయకల్ జలపాతం

**కనువిందు చేస్తున్న జలధారలు-పెద్ద ఎత్తున తరలిరానున్న పర్యాటకులు**



**సైదాపూర్ సెప్టెంబర్ 24 ( పీపుల్స్ డైరీ ) :** గత రెండు రోజులుగా కురుస్తున్న విస్తారమైన వర్షాలకు మండలంలోని రాయకల్ గ్రామంలో ఉన్న జలపాతం జలకళ సంతరించుకుంది. ఎత్తైన కొండల పైనుంచి ఉరకలెత్తుతూ జాలువారుతున్న నీటి ప్రవాహం ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఇన్నాళ్లూ నీరు లేక వెలవెలబోయిన జలపాతం, తాజా వర్షాలతో ప్రాణం పోసుకుని సజీవంగా మారింది. చుట్టుపక్కల దట్టమైన పచ్చదనం, ఎత్తు మీది నుంచి కిందికి దుముకుతున్న నీటి హోరుతో ఆ ప్రాంతమంతా ఎంతో ఆహ్లాదకరంగా దర్శనమిస్తోంది. ఈ ప్రకృతి రమణీయతను వీక్షించి, ఆస్వాదించేందుకు మండల ప్రజలే కాకుండా.. పొరుగున ఉన్న కరీంనగర్, వరంగల్, సిద్దిపేట జిల్లాల నుంచి పర్యాటకులు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా వారాంతంలో సందర్శకుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉండటంతో రాయకల్ జలపాతం వద్ద పర్యాటకుల కోలాహలం నెలకొననుంది. అయితే జలపాతంతో సందడి నెలకొన్న రాయికల్ జలపాతం అభివృద్ధికి ఏమాత్రం నోచుకోవడం లేదు. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకొని రాయికల్ పర్యాటక అభివృద్ధికి చొరవ చూపాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# చెరువుకు చిల్లు.. భారీగా నీటి వృథా

**పట్టించుకోని అధికారులు-మత్తడికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థుల డిమాండ్**



**సైదాపూర్ సెప్టెంబర్ 24( పీపుల్స్ డైరీ ) :** సైదాపూర్ నల్లచెరువు మత్తడి వద్ద నీరు పెద్ద ఎత్తున లీకేజీ అవుతూ వృథాగా పోతోంది. గ్రామానికి కీలకమైన ఈ చెరువు నీరు ఇలా కళ్లముందే వృథాగా పోతుండటంతో గ్రామస్థులు, రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మత్తడి వద్ద ఏర్పడిన పగుళ్ల కారణంగా కొద్ది రోజులుగా భారీగా నీరు లీక్ అవుతోంది. వర్షాకాలంలో వచ్చిన నీటిని ఒడిసిపట్టుకుని, వేసవి అవసరాలకు వినియోగించుకోవాల్సిన తరుణంలో.. ఇలా లీకేజీల వల్ల చెరువు క్రమంగా ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొంది. ఒకవైపు నీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రభుత్వాలు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఈ నీటి వృథాను అరికట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఇరిగేషన్ అధికారులు, గ్రామ పెద్దలు వెంటనే ఈ సమస్యపై దృష్టి సారించాలని సైదాపూర్ గ్రామస్థులు కోరుతున్నారు. తక్షణమే మత్తడి వద్ద మరమ్మతులు చేపట్టి, విలువైన జలాలను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు ఇలాగే నిర్లక్ష్యం వహిస్తే రాబోయే రోజుల్లో గ్రామంలో తీవ్ర నీటి ఎద్దడి తప్పదని వారు హెచ్చరిస్తున్నారు.

# సైదాపూర్‌లో దంచికొట్టిన వాన

**రెండు రోజుల్లో 105.6 మి.మీ. వర్షపాతం నమోదు**

**సైదాపూర్ సెప్టెంబర్ 24 (పీపుల్స్ డైరీ) :** గత రెండు రోజులుగా సైదాపూర్ మండల వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం తడిసిముద్దయింది. ఆకాశానికి చిల్లులు పడినట్లుగా ఏకధాటిగా కురిసిన వానతో వాగులు, వంకలు జలకళను సంతరించుకున్నాయి. మండల వ్యాప్తంగా గత 48 గంటల్లో రికార్డు స్థాయిలో 105.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ, సైదాపూర్ తహశీల్దార్ గుర్రం శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు.నిరంతరాయంగా కురిసిన ఈ భారీ వర్షాలతో మండలంలోని పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపైకి వర్షపు నీరు చేరడంతో వాహనదారుల రాకపోకలకు కొంతమేర అంతరాయం ఏర్పడింది. మరోవైపు ఈ వర్షాలు అన్నదాతల్లో ఆనందాన్ని నింపాయి. వానాకాలం పంటలకు ఈ వర్షం ఎంతో మేలు చేస్తుందని, చెరువులు, కుంటల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో రాబోయే రోజుల్లో సాగుకు, భూగర్భ జలాల పెరుగుదలకు ఢోకా ఉండదని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల సూచనల మేరకు, భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక యంత్రాంగం కోరింది.

# అడ్డంకులను దాటుకుని విజయవంతం గా ఛలో కేటీపీపీ కార్యక్రమం

- ముందస్తు అరెస్టులతో కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు కుట్ర..
- 24 గంటల కరెంట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రోడ్డు పై బైఠాయింపు...
- కరెంట్ కోతలకు ప్రభుత్వ అసమర్థతే కారణము...
- ప్రజలకు చెప్పకుండానే కరెంట్ కోతలు.. ఇది ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం..
- రైతులకు, ప్రజలకు, పరిశ్రమలకు నిరంతర విద్యుత్ అందించాలని డిమాండ్..



**భూపాలపల్లి సెప్టెంబర్ 24 పీపుల్స్ డైరీ..** గణపురం మండలం, చెల్పూర్ గ్రామంలోని కాకతీయ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి గారి ఆధ్వర్యంలో సందర్శించిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు,సత్యవతి రాథోడ్,తాటికొండ రాజయ్య,ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు ఆరూరి రమేష్, శంకర్ నాయక్,మాజీ ఛైర్పర్సన్ బడే నాగజ్యోతి మరియు భూపాలపల్లి నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు తదితరులు...

**ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...**

కరెంట్ కోతలకు ప్రభుత్వ అసమర్థతే కారణమని ఏద్దేవా చేశారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను పూర్తి సామర్థ్యంతో నడపకపోవడం,బొగ్గు నిల్వల నిర్వహణలో వైఫల్యం కారణంగానే రాష్ట్రంలో విద్యుత్ కోతలు ఏర్పడుతున్నాయని ఆరోపించారు.రాష్ట్రంలో పరిశ్రమలు, ఇళ్లు, రైతులకు విద్యుత్ కోతలు తప్పడం లేదని విమర్శించారు. విద్యుత్ సమస్యపై బీఆర్ఎస్ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు తెల్లవారుజామునే నాయకులను అరెస్టు చేయడం ప్రభుత్వ భయానికి నిదర్శనమన్నారు.రాష్ట్రంలో ప్రస్తుతం ఇళ్లకు కూడా ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ కోతలు విధిస్తున్నారని,ఈ పరిస్థితికి రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా వైఫల్యం, విద్యుత్ రంగంలో సరైన నిర్వహణ లేకపోవడమే కారణమని అన్నారు.భూపాలపల్లి ప్రాంతంలోనే రెండు ఓపెన్‌కాస్ట్ గనులు ఉండటంతో పాటు తాడిచర్లలో కూడా బొగ్గు గనులు ఉన్నాయని, ఇంత పెద్ద బొగ్గు నిల్వలు ఉన్న ప్రాంతంలోనే విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గు కొరత ఏర్పడటం పాలనా లోపాలకు నిదర్శనమని ఆయన విమర్శించారు.సింగరేణి--జెన్‌కో మధ్య ఉన్న ఆర్థిక లావాదేవీలు, బకాయిల అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు సరఫరా, విద్యుత్ కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బొగ్గు కొరత, థర్మల్ విద్యుత్ ఉత్పత్తిలో అంతరాయాలు రాష్ట్ర విద్యుత్ వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని ఇటీవలి నివేదికలు కూడా పేర్కొంటున్నాయి.

**మాకు కావాల్సింది రాజకీయాలు కాదు.. కరెంట్**

రైతులకు సాగునీటి కోసం కరెంట్ కావాలి, ఇళ్లకు నిరంతర విద్యుత్ కావాలి, పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా కావాలని అన్నారు. విద్యుత్ సరఫరా సరిగా లేకపోతే పరిశ్రమలు, వ్యాపారాలు తీవ్రంగా ప్రభావితమవుతాయని పేర్కొన్నారు.ప్రజల సమస్యలను రాజకీయ కోణంలో చూడకుండా,తక్షణమే విద్యుత్ సమస్యకు పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదు,ప్రభుత్వ పాలనా వైఫల్యంతో ఏర్పడిన విద్యుత్ సంక్షోభం అని అన్నారు. రైతులకు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని, విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గును అందుబాటులో ఉంచాలని, నిలిచిపోయిన విద్యుత్ ఉత్పత్తి యూనిట్లను పూర్తి సామర్థ్యంతో నడిపించాలని ఆయన డిమాండ్ చేశారు.దేశంలోని 29 రాష్ట్రాల్లో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా తెలంగాణ రైతులకు 24 గంటల ఉచిత, నాణ్యమైన విద్యుత్ అందించిన నాయకుడు కేసీఆర్ అని అన్నారు.ఉమ్మడి పాలనలో కరెంట్ కోతలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో ఆరుగురు రైతులు ప్రాణాలు కోల్పోయారని, తెలంగాణ ఉద్యమమే కరెంట్ పోరాటాల నుంచి పుట్టిందని గుర్తుచేశారు. 2014 నాటికి రాష్ట్రంలో 19 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉండగా, కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్ల పాలనలో ఒక్క రూపాయి ఖర్చు లేకుండా వాటిని 30 లక్షలకు పెంచారని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లలో ఒక్క కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కూడా ఇవ్వలేకపోయిందని విమర్శించారు. 2014 నుంచి 2023 వరకు విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీ వ్యవస్థల కోసం కేసీఆర్ ప్రభుత్వం రూ.లక్ష కోట్లు వెచ్చించిందని పల్లా తెలిపారు. రాష్ట్రం ఏర్పడే నాటికి 5,500 మెగావాట్లుగా ఉన్న స్థాపిత విద్యుత్ సామర్థ్యాన్ని 22,000 మెగావాట్లకు పెంచిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. కేటీపీపీ, భద్రాద్రి, యాదాద్రి పవర్ స్టేషన్లతో పాటు ఎన్టీపీసీలో 1,600 మెగావాట్లు, 5,000 మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. మూడు, నాలుగేళ్లలో భారీ థర్మల్ ప్రాజెక్టులు నిర్మించడంతోపాటు వేల కోట్లతో 400 కేవీ, 132 కేవీ సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి పటిష్టమైన విద్యుత్ నెట్‌వర్క్ నిర్మించామని పేర్కొన్నారు.సింగరేణి సంస్థకు జెన్‌కో విభాగం రూ.52 వేల కోట్ల బకాయిలు ఉండటంతో బొగ్గు సరఫరా నిలిపివేశారని ఆరోపించారు. రికార్డుల్లో 40 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు చూపుతున్నా వాస్తవంగా నిల్వలు లేవన్నారు. నాణ్యమైన బొగ్గును ఆంధ్రప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాలకు విక్రయిస్తూ తెలంగాణ ప్రాజెక్టులకు సరఫరా చేయడం లేదని విమర్శించారు. కేటీపీపీకి రోజుకు 5,000 టన్నుల బొగ్గు అవసరం ఉండగా కేవలం 1,500 టన్నులు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. యాదాద్రి, భద్రాద్రి, భూపాలపల్లి ప్లాంట్లలో సగానికిపైగా యూనిట్లను షట్‌డౌన్ చేసి కృత్రిమ విద్యుత్ కొరత సృష్టిస్తున్నారని ఆరోపించారు.తాము వస్తున్నామని తెలిసి రెండు యూనిట్లను నడుపుతున్నట్లు చూపిస్తున్నారని, తమ పర్యటన ముగిసిన తర్వాత మళ్లీ షట్‌డౌన్ పేరుతో మూసివేసే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. మంత్రులు రైతుల సంక్షేమాన్ని పట్టించుకోకుండా దోపిడీలో మునిగిపోయారని ఆరోపించారు. విద్యుత్ శాఖ మంత్రి కమీషన్ల వేటలో ఉండగా, ఇన్‌చార్జి మంత్రులు 30,40 శాతం వాటాల కోసం భూముల పంచాయితీలు, రియల్ ఎస్టేట్ దందాలు చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రికి కూడా రైతులకు 24 గంటల కరెంట్ ఇవ్వడంపై చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రుల కంటే పెద్ద రియల్ ఎస్టేట్ బ్రోకర్లు ఎవరూ లేరని ఎద్దేవా చేశారు.కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో రిజర్వాయర్లు నిండుతున్నా తెలంగాణలో గోదావరి నిండుగా ప్రవహిస్తున్నా నీటిని ఎత్తిపోసే చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. సమ్మక్క సాగర్ వద్ద లక్ష క్యూసెక్కుల నీరు వృథాగా పోతున్నా ఉమ్మడి వరంగల్ మంత్రులు, ఎమ్మెల్యేలు ఒక్కరోజైనా సమీక్ష నిర్వహించారా అని ప్రశ్నించారు. కాళేశ్వరం ఎత్తిపోస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందనే అక్కసుతో దేవాదుల మోటార్లు కూడా నడపడం లేదని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో సమ్మక్క సాగర్ నిర్మాణం, 48 కిలోమీటర్ల టన్నెల్, రిజర్వాయర్ల నిర్మాణం జరిగితే ప్రస్తుత ప్రభుత్వం ఒక్క మీటర్ కాలువ కూడా తవ్వలేదని, ఒక్క తట్టెడు మట్టి తీయలేదని, ఒక్క మోటారు పెట్టలేదని విమర్శించారు. కరెంట్ లేదనే సాకుతో మోటార్లు నడపకుండా పంటలను ఎండబెడుతున్నారని ఆరోపించారు.

## క్షత్రియ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో

# మ్యాజిక్ బస్-ఐబీఎం స్కిల్స్‌బిల్డ్ ఉచిత ఆఫ్‌లైన్ శిక్షణ కార్యక్రమం

- శిక్షణలో ప్రధానంగా వివరించిన అంశాలు:
- కృత్రిమ మేధస్సుకు పరిచయం
- సహజ భాషా ప్రక్రియ మరియు కంప్యూటర్ విజన్
- యంత్ర అభ్యాసం మరియు డీప్ లెర్నింగ్
- ఐబీఎం వాట్సన్ స్టూడియో ద్వారా ఏఐ నమూనాల నిర్వహణ
- కృత్రిమ మేధస్సులో నైతిక విలువలు
- కృత్రిమ మేధస్సు రంగంలో భవిష్యత్ ఉద్యోగ అవకాశాలు



**ఆర్మూర్,సెప్టెంబర్,24(పీపుల్స్ డైరీ) :** చెపూర్ క్షత్రియ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో విద్యార్థులకు కృత్రిమ మేధస్సు (ఏఐ)పై అవగాహనతో పాటు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు మ్యాజిక్ బస్,ఐబీఎం స్కిల్స్‌బిల్డ్ ఆధ్వర్యంలో మూడు రోజుల ఉచిత ఆఫ్‌లైన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమం 21వ తేదీ నుండి 23 వ తేదీ వరకు కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించారని మూడు రోజులపాటు జరిగిన ఈ శిక్షణలో ప్రస్తుత సాంకేతిక రంగంలో కీలకంగా మారుతున్న కృత్రిమ మేధస్సుకు సంబంధించిన వివిధ అంశాలపై నిపుణులు విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. సైద్ధాంతిక పరిజ్ఞానంతో పాటు ఆచరణాత్మకంగా ఉపయోగపడే అంశాలను కూడా వివరించారు.

**కళాశాల ప్రిన్సిపాల్ డా. కట్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..**

ప్రస్తుత సాంకేతిక ప్రపంచంలో కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యాసం, డీప్ లెర్నింగ్ వంటి ఆధునిక సాంకేతికతలు అన్ని రంగాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఇంజినీరింగ్ విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇటువంటి ఉచిత శిక్షణ కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యా ప్రాజెక్టులు, పరిశోధన, భవిష్యత్ ఉద్యోగాల్లో ఉపయోగించుకోవాలని సూచించారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ అల్జాపూర్ దేవేందర్ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక యుగంలో కృత్రిమ మేధస్సు ప్రతి రంగంలోనూ వేగంగా విస్తరిస్తోందని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్ సాంకేతిక మార్పులకు అనుగుణంగా తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సృజనాత్మక ఆలోచనా విధానం, సమస్య పరిష్కార సామర్థ్యం, సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడంలో ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.

మ్యాజిక్ బస్,ఐబీఎం స్కిల్స్‌బిల్డ్ సంస్థలు విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న ఈ శిక్షణ ద్వారా కృత్రిమ మేధస్సుపై ప్రాథమిక అవగాహనతో పాటు ప్రస్తుత ఉద్యోగ మార్కెట్‌కు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునే అవకాశం విద్యార్థులకు లభించిందన్నారు. ముఖ్యంగా ఐబీఎం వాట్సన్ స్టూడియో వంటి ఆధునిక సాధనాల ద్వారా ఏఐ నమూనాలను ఎలా ఉపయోగించాలో తెలుసుకోవడం విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధికి ఎంతో ఉపయోగకరమని తెలిపారు. విద్యార్థులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని కొత్త సాంకేతికతలను నేర్చుకోవడంతో పాటు వాటిని ఆచరణలో పెట్టాలని సూచించారు. భవిష్యత్‌లో ఏఐ ఆధారిత సాంకేతికతలకు సంబంధించిన ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను ఇప్పటి నుంచే అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన మరిన్ని నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించేందుకు కళాశాల యాజమాన్యం ఎల్లప్పుడూ సహకరిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులకు విలువైన శిక్షణ అందిస్తున్న మ్యాజిక్ బస్, ఐబీఎం స్కిల్స్‌బిల్డ్ సంస్థలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**కళాశాల డైరెక్టర్ వీరేందర్ మాట్లాడుతూ,**

కృత్రిమ మేధస్సు రంగంలో వేగంగా వస్తున్న మార్పులను విద్యార్థులు అర్థం చేసుకుని, వాటికి అనుగుణంగా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. భవిష్యత్ ఉద్యోగ అవకాశాలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సమస్య పరిష్కార నైపుణ్యాలు, సృజనాత్మక ఆలోచనా విధానం మరియు కమ్యూనికేషన్ నైపుణ్యాలను కూడా పెంపొందించుకోవాలని తెలిపారు.

**కళాశాల శిక్షణ, నియామకాల అధికారి శ్రీ సునీల్ గటడి మాట్లాడుతూ,**

కృత్రిమ మేధస్సు రంగంలో ఉద్యోగ అవకాశాలు విస్తరిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు పరిశ్రమ ఆధారిత శిక్షణ అందించడం ద్వారా వారి ఉద్యోగ సాధన సామర్థ్యాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. విద్యార్థులు శిక్షణలో చురుకుగా పాల్గొని, నిపుణులు అందించిన సూచనలు మరియు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆచరణాత్మకంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు పరిశ్రమ అవసరాలను అర్థం చేసుకోవడంలో విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్ ఫోన్ సందేశం ద్వారా కార్యక్రమ నిర్వాహకులు, శిక్షకులు, పాల్గొన్న విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌కు ఉపయోగపడే నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు కళాశాల యాజమాన్యం ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండెంట్ అల్జాపూర్ దేవేందర్, డైరెక్టర్ వీరేందర్, ప్రిన్సిపాల్ డా. కట్కం శ్రీనివాస్, ఏఓ బి. నరేందర్, టీపీఓ శ్రీ సునీల్ గటడి, అన్ని విభాగాల అధిపతులు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ శృతిన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై ప్రజలకు పూర్తి స్పష్టత ఇవ్వాలి

- **ఓటర్ల హక్కుల విషయంలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పారదర్శకత అవసరం: మంత్రి పొన్నం ప్రభాకర్**

**హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) సెప్టెంబర్ 24 :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) విషయంలో ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరుపై ఇటీవల వెలుగులోకి వచ్చిన అంశాలు ప్రజల్లో అనేక ప్రశ్నలను, అనుమానాలను కలిగిస్తున్నాయని రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఓటర్ల జాబితా అనేది ప్రజాస్వామ్యానికి పునాది అని, ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు ఉండేలా చూడటం ఎన్నికల సంఘం అత్యంత కీలకమైన బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. గత 10 నెలల్లో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి దాదాపు 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న అంశం తాజాగా వెలుగులోకి వచ్చిందని మంత్రి తెలిపారు. వారి అభ్యంతరాలు కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ, ఎన్నికల జాబితా సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన అంశాలను కూడా స్పృశిస్తున్నాయని చెప్పారు.



## ఫారం-6లో మార్పులపై స్పష్టత ఇవ్వాలి

కొత్తగా ఓటు హక్కు పొందే పౌరులు ఉపయోగించే ఫారం-6లో SIR కు సంబంధించిన ప్రశ్నలను చేర్చడంపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు నివేదికలు చెబుతున్నాయని మంత్రి అన్నారు. ఫారం-6 అనేది నిబంధనల ప్రకారం నిర్దేశించిన చట్టబద్ధమైన ఫారం అయితే, అందులో మార్పులు చేయడానికి ఏ ప్రక్రియ అనుసరించారు? ఎవరి అనుమతితో మార్పులు చేశారు? ఆ మార్పులకు చట్టపరమైన ఆధారం ఏమిటి? అనే విషయాలను ఎన్నికల సంఘం ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా తొలిసారి ఓటు హక్కు పొందే య-ువతకు ఎలాంటి అనవసర ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. ఫారం-6లో చేసిన మార్పులపై ఇద్దరు కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో ఎన్నికల సంఘం దీనిపై పూర్తి వివరణ ఇవ్వాలని కోరారు.

## ECIనెట్, ఓటర్ల డేటాపై పారదర్శకత అవసరం

ECIనెట్ వంటి కేంద్రీకృత ఐటీ వ్యవస్థ ద్వారా ఓటర్ల డేటాలో మార్పులు చేసే విధానం ఉంటే, క్షేత్రస్థాయిలో చట్టబద్ధమైన అధికారాలు కలిగిన Electoral Registration Officers (EROs) పాత్ర, వారి పర్యవేక్షణ, బాధ్యత ఏమిటో ఎన్నికల సంఘం స్పష్టం చేయాలని మంత్రి అన్నారు. ఓటర్ల డేటా ఎవరు మార్చారు? ఎప్పుడు మార్చారు? ఏ కారణంతో మార్చారు? ఏ అధికారి అనుమతితో మార్చారు? అనే వివరాలకు ఆడిట్ ట్రయల్ ఉండాలని, అవసరమైన మేరకు ఆ సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. కేంద్రీకృత డిజిటల్ వ్యవస్థల విషయంలో భద్రతా ప్రమాణాలు, అధికారాల విభజన, జవాబు దారీతనం వంటి అంశాలపై స్పష్టత ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశాలపై ఎన్నికల కమిషనర్లు కూడా ఆందోళనలు వ్యక్తం చేసినట్లు నివేదికలు పేర్కొంటున్నాయని తెలిపారు.

## ఓటర్ల పేర్ల తొలగింపుపై పూర్తి వివరాలు వెల్లడించాలి

SIR ప్రక్రియలో పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ జాబితాల నుంచి తొలగించబడినట్లు నివేదికలు వెలువడ్డాయని మంత్రి పేర్కొన్నారు. అయితే పేర్ల తొలగింపు ఏ కారణాలపై జరిగింది? ఎంతమంది పేర్లు తొలగించారు? ఎంతమంది అభ్యంతరాలు తెలిపారు? ఎన్ని పేర్లు తిరిగి చేర్చారు? అనే పూర్తి వివరాలను రాష్ట్రాల వారీగా, నియోజకవర్గాల వారీగా ఎన్నికల సంఘం బహిరంగపరచాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘంపై వచ్చిన ఆరోపణలు నిజమా? కాదా? అనే విషయం రాజకీయ వాదోపవాదాల ద్వారా తేలకూడదని, ఓటర్ల జాబితాకు సంబంధించిన పూర్తి డేటా, తొలగింపుల వివరాలు, కొత్తగా చేర్చిన పేర్లు, అభ్యంతరాలు, అప్పీళ్ల పరిష్కారం వంటి సమాచారాన్ని ప్రజల ముందుంచడం ద్వారా వాస్తవాలు స్పష్టమవుతాయని మంత్రి అన్నారు. ఎన్నికల సంఘం ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తుందన్న అనుమానాలకు తావులేకుండా వ్యవహరించాలి చీఫ్ ఎలక్షన్ కమిషనర్ శ్రీ జ్ఞానేష్ కుమార్ నాయకత్వంలోని ఎన్నికల సంఘం ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తుందన్న ప్రశ్నలు ప్రజల్లో తలెత్తకుండా, ప్రతి నిర్ణయం చట్టబద్ధంగా, పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఉండేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అదే సమయంలో, ఎన్నికల సంఘం అన్ని నిర్ణయాలు ముగ్గురు కమిషనర్ల ఏకాభిప్రాయంతోనే జరిగాయని ఎన్నికల సంఘం వర్గాలు స్పష్టం చేసిన విషయాన్ని కూడా ప్రస్తావిస్తూ, వివిధ స్థాయిల్లో నమోదైన అభ్యంతరాలపై పూర్తి వివరాలను బహిరంగపరచడం ద్వారా ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు.

## తెలంగాణలో అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడుతాం

తెలంగాణలో అర్హత కలిగిన ప్రతి పౌరుడి ఓటు హక్కు కాపాడబడేలా ప్రభుత్వం అప్రమత్తంగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఒక్క అర్హుడైన ఓటరు పేరు కూడా పొరపాటున తొలగించకుండా చూడటం ఎంత ముఖ్యమో, అనర్హమైన పేర్ల విషయంలో చట్టం, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైన రాజ్యాంగ హక్కు అని, అందువల్ల ఓటర్ల జాబితా తయారీ, సవరణ, పేర్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు, డేటా మార్పులు వంటి ప్రతి దశలో పారదర్శకత, చట్టబద్ధత, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# పాఠశాలల్లో ఎఫ్‌ఎల్‌ఎన్ పని భారాన్ని తగ్గించాలి

- **ఏంఈఓ కు వినతి పత్రం అందచేసిన ఉపాధ్యాయులు**

**వీణవంక సెప్టెంబర్ 25( పీపుల్స్ డైరీ) :** మండలంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో గల ఉపాధ్యాయులు ఎఫ్ఎల్ఎన్ పని భారాన్ని తగ్గించాలని మండల విద్యాధికారికి వినతి పత్రాన్ని అందచేశారు. పిఎస్,యుపిఎస్ పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ అమలులో భాగంగా పని భారం అధికం కావడం వలన ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారు. అని వారు అన్నారు. అందులో ఆన్లైన్ పనులు ఎఫ్ఆర్ఎస్ వర్క్,ఏక్ పెడ్ మా కే నామ్, ఎస్వైఆర్, స్పర్శ ప్రశస్త్, తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్, ఐఎస్ఎం ఎస్ పోర్టల్ ఎఫ్ఎల్ఎన్ ఆన్లైన్ ఎక్సమ్, అడ్మిషన్స్ అలాగే ఆఫీస్ పనులకు సంబంధించిన రికార్డులు, రిజిస్టర్ల నిర్వహణ వివిధ నివేదికల తయారీ నెలవారి సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, అధికారిక పనులు,18 రకాల విషయాల బోధన, హాజరు శాతం పెంచడం అభ్యసన ఫలితాల నమోదు, డేటు డే పనులు, రెమిడేషన్ టీచింగ్, ఎఫ్ఎల్ఎన్ అభ్యసన ఫలితాలు టెక్స్ట్ బుక్స్,వర్క్ బుక్స్ నిర్వహణ,మూల్యాంకనం, టిఎల్ఎం తయారీ, పాఠ్యప్రణాళిక అనేక లక్ష్యాలను నిర్దేశించడం జరుగుతున్నది. అదే విధంగా డీఈవో, ఏఎంఓ, ఎఫ్ఎల్ఎన్ పర్యవేక్షణ బృందం, కలెక్టర్ బృందం, ఎంఈఓ కాంప్లెక్స్ హెచ్ఎం తదితరుల పర్యవేక్షణ కూడా నిరంతరం ఉండడం వలన పాఠశాలల్లో పని చేసే ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురి అవుతున్నారు. పాఠశాలలో ఒకరు లేదా ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉండడం వారి పై ఇతర అదనపు పనులు కూడా ఉండడం వలన ఒత్తిడి మరింత పెరుగుతోంది ఇటీవల ప్రశాంత్ అనే చిల్వకోడూరు గ్రామం గొల్లపల్లి మండలం జగిత్యాల జిల్లా లో ఉపాధ్యాయుడు కాంప్లెక్స్ సమావేశాలలోనే నిద్ర మాత్రలు



మింగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బాధ కలిగించింది. ఇలాంటి ఘటనలు మళ్ళీ పునరావృతం కాకుండా ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో పనిచేసే ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులపై ఉన్న ఎఫ్ఎల్ఎన్ పని భారాన్ని తగ్గించాలని వారి మానసిక ఒత్తిడిని తగ్గించే చర్యలు తక్షణమే చేపట్టాలని వారు కోరారు. ఉపాధ్యాయులను బోధనకు సంబంధించిన పనులకు మాత్రమే ఉపయోగించాలని తగిన విధంగా ఉత్తర్వులు జారీ చేయాలని వారు కోరారు.

# గుంటిపెల్లి దుర్గేశ్ పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దాం-సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్



**హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) సెప్టెంబర్ 24:** హుస్నాబాద్ పట్టణంలో రోడ్డు వెడల్పు పేరుతో మహనీయులైన అనభేరి ప్రభాకర్ రావు విగ్రహాలను తొలగించిన అధికారులు తిరిగి నెలకొల్పేటంలో నిర్లక్ష్యం వహించడం సరైన పద్ధతి కాదు.. అలాగే స్వర్గీయులైన ఎంతో మంది మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసుకోవలసిన స్థానంలో ఎక్కడో మైదానంలో కానీ క్రీడా స్థలాలలో కానీ ఏర్పాటు చేయవలసిన బొమ్మలను తీసుకువచ్చి మహనీయులను గుర్తు చేసుకునేలా ఏర్పాటు చేసుకోవాల్సిన విగ్రహాల స్థానంలో ఆ బొమ్మలను నెల కొల్పడం దేనికి నిదర్శనమో అధికారులు చెప్పాలని తొలగించిన విగ్రహాలను వెంటనే నెల కోల్పోకపోతే గుంటుపల్లి దుర్గేశ్ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని నిరసన కార్యక్రమాలతో నిరాహార దీక్షలతో అధికారులను నిలదీసే కార్యక్రమం త్వరలోనే చేపడతామని గడిపె మల్లేశ్ అన్నారు. పేదలకు అన్యాయం జరుగుతుంది అని తెలిసిన క్షణం పేదల వెంటే ఉంటు బాధితులకు న్యాయం జరిగే వరకు అధికారులకు ఏమాత్రం భయపడకుండా ఎర్రజెండాను చేతిలో పట్టుకుని అన్యాయాల ఎదుర్కొనే గొప్ప నాయకున్ని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) కోల్పోయి 7 సంవత్సరాలు గడిచినా దుర్గేశ్ వర్ధంతి కార్యక్రమం స్థానిక అనభేరి, సింగిరెడ్డి అమరుల భవనంలో హుస్నాబాద్ మండల సిపిఐ పార్టీ పక్షాన ఘనంగా నిర్వహించి ఆయన చిత్ర పటానికి పుల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి హుస్నాబాద్ మాజీ వైస్ ఎంపిపి గడిపె మల్లేశ్ మాట్లాడుతూ గుంటిపెల్లి దుర్గేశ్ చేసిన పోరాటాలను గుర్తు చేసుకుంటూ ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తహసీల్దారు కార్యాలయం ముట్టడి,కొత్త చెరువు శిఖం భూమి కబ్జాకు గురికాకుండా చేసిన పోరాటాలు అభినందనీయమని మనం కోల్పోయిన ముఖ్య సిపిఐ నాయకులు దుర్గేశ్ ఆశాయాల సాధనకు ప్రజా పోరాటాలను కొనసాగిస్తూ మన మందరం ఎర్రజెండ చేతబుని నేడు దేశంలో జరుగుతున్న అన్యాయాలను ఎక్కడికక్కడే ఎండగట్టి నప్పుడే పేదలకు న్యాయం జరుగుతుందని అంతవరకు పోరాటాలు చేయాలని అప్పుడే అమరుల ఆశయాలు ఫలిస్తాయని దుర్గేశ్ లాంటి ప్రజా నాయకులకు ఘన మైన అని గడిపె మల్లేశ్ అన్నారు. ఈ కార్య క్రమంలో భారతజాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జనగాం రాజ్ కుమార్, అయిలేని మల్లారెడ్డి, మహ్మద్ అక్బర్, వంగ రాజు, అంకం శ్రీనివాస్, పెద్ది నిర్మల అంకం సాయి కుమార్ గుంటిపెల్లి దుర్గేశ్ కుటుంబ సభ్యులు, గుంటిపెల్లి అజయ్, గుంటిపెల్లి శైలేజ, ముద్రకోల శ్యామల, ముద్రకొల రవీందర్ పాల్గొన్నారు.

# బహుజన అవార్డుల దరఖాస్తులకు ఆహ్వానం

- **బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర కమిటీ సభ్యులు ముక్కెర సంపత్ కుమార్**

**హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) సెప్టెంబర్ 24 :** వివిధ రంగాలలో కృషి చేసిన గ్రామీణ ప్రాంత ప్రముఖులకు దేశ రాజధాని న్యూఢిల్లీలో అందించే అవార్డులకు సిద్దిపేట జిల్లా నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర కమిటీ సభ్యులు ముక్కెర సంపత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు నవంబర్ 15న ఢిల్లీలో జరిగే బహుజన సాహిత్య అకాడమీ 20వ నేషనల్ కాన్ఫరెన్స్ లో మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, ఏపీజే అబ్దుల్ కలాం, సేవారత్న, సాహిత్యరత్న, ఉత్తమ కౌన్సిలర్, ఉత్తమ సర్పంచ్, బెస్ట్ ఉమెన్ లీడర్షిప్ తదితర అవార్డులను అందజేయుటకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ అవార్డు కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు పూలే అంబేద్కర్ సిద్ధాంతాలతో పనిచేసే ఇతర కులాల వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని, ప్రజా ఉద్యమకారులు, సంఘ సేవకులు, కవులు, కళాకారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కూడా అవార్డుకు అర్హులేనని సంపత్ పేర్కొన్నారు. దరఖాస్తు ఫారం, పూర్తి వివరాల కోసం తనను నేరుగా గానీ, 9441797207 నెంబరులో ఫోనులో గానీ సంప్రదించవచ్చునని సంపత్ పేర్కొన్నారు



# ఘనంగా ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**హుస్నాబాద్, టౌన్ : (పీపుల్స్ డైరీ) సెప్టెంబర్ 24:** ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్, ఎన్ఎస్ఎస్ చైర్మన్ వి.లలిత అధ్యక్షతన అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థినులు ప్రతిజ్ఞ చేశారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అంకితభావంతో సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమాలు, సామాజిక అవగాహన ర్యాలీలు, ప్రత్యేక శిబిరాల్లో చురుకుగా పాల్గొని సేవాభావాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రోగ్రాం అధికారి డి.కరుణాకర్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ఆవిర్భావం, లక్ష్యాలు, నిర్వహించే కార్యక్రమాలపై వివరించారు. మొక్కల పెంపకం, ట్రాఫిక్ నియంత్రణ, సామాజిక అవగాహన కార్యక్రమాల్లో వాలంటీర్లు భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం ప్రిన్సిపల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది శాలువాతో సన్మానించారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డి.రవీందర్, ఎస్.సదానందం, టి.నిర్మలాదేవి, బి.లక్ష్మయ్య, ఎ.సంపత్, ఎస్.కవిత, కే.స్వరూప, జి.కవిత, ఓ.రాణి, జూనియర్ అసిస్టెంట్లు కే.గీతాంజలి, ఎస్.రాములు, రికార్డు అసిస్టెంట్ టి.రమాదేవి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# వాటర్ ప్లాంట్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

## కేడం లింగమూర్తి- బాలవికాస సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు



**హుస్నాబాద్, టౌన్: (పీపుల్స్ డైరీ) సెప్టెంబర్ 24 :** బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో నిర్వహిస్తున్న పలు వాటర్ ప్లాంట్లను సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కేడం లింగమూర్తి సందర్శించి పరిశీలించారు. గిర్నిబాయి, రాజ్యు తండా, పిజి తండా తదితర గ్రామాల్లో ప్లాంట్ల పనితీరు, నిర్వహణ, రికార్డులు, ప్రజలకు తాగునీటి సరఫరా విధానాన్ని పరిశీలించారు. యంత్ర పరికరాల లోపాలతో పనిచేయని ప్లాంట్లకు త్వరితగతిన మరమ్మతులు చేపట్టి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని సంస్థ ప్రతినిధులకు సూచించారు. పలు రాష్ట్రాల్లో సుమారు 1,600 వాటర్ ప్లాంట్లను నిర్వహిస్తున్నట్లు కేడం లింగమూర్తి తెలిపారు. అవసరమైన గ్రామాల్లో కొత్త ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ప్రస్తుతం బాలవికాస ఆధ్వర్యంలో ఒక వాటర్ ప్లాంట్ నిర్వహిస్తున్నామని, త్వరలో మరో రెండు ప్లాంట్లను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. వీరి వెంట బాలవికాస సంస్థ చీఫ్ మేనేజర్ ఫ్రాన్సిస్‌రెడ్డి, మేనేజర్ మధుసూదన్‌రెడ్డి, జోనల్ డైరెక్టర్లు కృష్ణారెడ్డి, యాకూబ్‌రెడ్డి, జోనల్ కోఆర్డినేటర్ నరేష్, ఫీల్డ్ కోఆర్డినేటర్ మల్లారావు, సంస్థ ప్రతినిధులు, సభ్యులు, గ్రామాల కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# సామాజిక సేవలో విద్యార్థుల భాగస్వామ్యం కీలకం



**హుస్నాబాద్. టౌన్: (పీపుల్స్ డైరీ) సెప్టెంబర్ 24 :** సామాజిక సేవలో విద్యార్థులను భాగస్వాములుగా తీర్చిదిద్దడంలో జాతీయ సేవా పథకం కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చెన్నూరి గంగాధర్ అన్నారు. గురువారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సేవాభావం, బాధ్యతాయుత దృక్పథాన్ని పెంపొందించడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యమన్నారు. 'నా కోసం కాదు.. మీ కోసం' అనే నినాదం ప్రతి వాలంటీర్‌కు మార్గదర్శకంగా ఉండాలని సూచించారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్క నాటి, దాని సంరక్షణ బాధ్యత తీసుకోవాలని కోరారు. సమాజం కోసం తాను చేయగలిగిన సేవ ఏమిటనే ఆలోచన విద్యార్థుల్లో పెంపొందాలని అన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తిరునహరి రణధీర్ కుమార్ మాట్లాడుతూ.. సేవాభావంతో సమాజంలో మార్పు తీసుకురావచ్చన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రతిజ్ఞ చేయడంతో పాటు కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటి పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎస్.ఎస్. రాజు, సుధగోని సత్యనారాయణ, వి. సదాశివ్, బి. ఎల్లయ్య, బి. వాల్య, ఎస్. వెంకట ముత్యం, సిహెచ్. విద్యాసాగర్, పి. చంద్రమోహన్, సిహెచ్. రాజిరెడ్డి, ఎస్. అశోక్, ఎం. వెంకటేష్, ఏ. మమత, గ్రంథపాలకులు ఆర్. వాసవి, వెంకటసాయి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశం



**హుజురాబాద్ సెప్టెంబర్ 24 ( పీపుల్స్ డైరీ) :** మండలంలోని ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు రెండో కాంప్లెక్స్ సమావేశాన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి అధ్యక్షతన జరిగిన సమావేశానికి మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు నేర్చుకునే విధానాలు, చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి సులభంగా అర్థమయ్యేలా బోధించే పద్ధతులపై చర్చించారు. బోధనలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం) ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా పోతన గ్రూపు ఉపాధ్యాయులు టీఎల్ఎం సహాయంతో పాఠ్యాంశాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేందర్‌రెడ్డి, తాళ్ల తిరుపతి, ప్రవీణ్, సతీష్ ప్రతాప్‌రెడ్డి, రాజేష్, ఆదయ్య, ఆర్పీలు పత్యం శ్రీనివాస్, అల్లి శ్రీనివాస్, తంగళ్లపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యర్థాల వేర్పాటుపై అవగాహన




**హుజురాబాద్ సెప్టెంబర్ 24 (పీపుల్స్ డైరీ):** స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమంలో భాగంగా హుజురాబాద్ మండలం తుమ్మనపల్లి గ్రామ పంచాయతీలో గురువారం ఇంటింటి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటిలో వ్యర్థాలను సక్రమంగా వేరు చేయడం, గ్రామంలో పరిశుభ్రతను కాపాడుకోవడం, పరిసరాలను స్వచ్ఛంగా ఉంచుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. తడి వ్యర్థాలు, పొడి వ్యర్థాలు, శానిటరీ వ్యర్థాలు, ప్రత్యేక శ్రద్ధ అవసరమైన వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి అందించాలని సూచించారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన గ్రామ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, టెక్నికల్ అసిస్టెంట్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువత, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

# సాయిబాబా ఆలయంలో అన్నదానం



**హుజురాబాద్ సెప్టెంబర్ 24 ( పీపుల్స్ డైరీ) :** పట్టణంలోని సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్ వెంపటి సదానందం ఆహ్వానం మేరకు బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్, నాయకులు ఆలయాన్ని సందర్శించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదాన దాత మామునూరి ప్రవీణ్‌కుమార్‌ను ఆలయ కమిటీ సభ్యులు, బీసీ జేఏసీ నాయకులు సన్మానించారు. ప్రతి గురువారం ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని జనార్ధన్ అన్నారు. అన్నదాతలు మామునూరి ప్రవీణ్‌కుమార్, ప్రణీత శ్రీయాన్ కుటుంబ సభ్యులతో పాటు కొలిపాక శంకర్--లలిత కుటుంబ సభ్యులను అభినందించారు. ప్రజలంతా పరస్పరం సహకరించుకుంటూ స్నేహపూర్వక వాతావరణంలో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి వరుణ్ శర్మ, వైస్ చైర్మన్ ఇనుగాల సత్తిబాబు, బీసీ సంక్షేమ జాతీయ సంఘం మహిళా జనరల్ సెక్రటరీ దేవసాని ప్రియదర్శిని, జేఏసీ నాయకులు కొలిపాక క్రాంతికుమార్, చిలుకమారి శ్రీనివాస్, మంచికట్ల రమేష్, నడిగోటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో బొగ్గు కొరతకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం

## యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ను పరిశీలించిన జగదీశ్ రెడ్డి



నల్గొండ జిల్లా దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లో ఎదు-రవుతున్న బొగ్గు కొరతకు, విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడానికి రాష్ట్ర ప్రభుత్వం, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని మాజీ మంత్రి, సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ ప్రతినిధుల బృందంతో కలిసి ఆయన ఈరోజు యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను స్వయంగా పరిశీలించారు. అనంతరం ప్లాంట్ అధికారులతో సమావేశమై విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడానికి గల సాంకేతిక, పరిపాలనాపరమైన కారణాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. సింగరేణి సంస్థ నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేస్తున్నప్పటికీ, ప్లాంట్లకు సక్రమంగా సరఫరా చేయకుండా దాదాపు 40 లక్షల టన్నుల బొగ్గును పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. తెలంగాణలోని పవర్ ప్లాంట్లకు బొగ్గు కొరత సృష్టించి, ప్రజలను ముఖ్యంగా రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఏ విధంగానైతే 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్‌ను అందించిందో, అదే రీతిలో పవర్ ప్లాంట్లకు పూర్తిస్థాయిలో బొగ్గు సరఫరా చేసి నిరంతర విద్యుత్ అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

# అన్ని శాఖలు సమన్వయంతో సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

- ఈ నెల 30న సీఎం చేతుల మీదుగా పండుగ వాతావరణంలో కలెక్టరేట్ ప్రారంభోత్సవం..
- ప్రధాన ద్వారం నుంచి కలెక్టరేట్ కార్యాలయం సుందరంగా ముస్తాబు చేయాలి..
- సీఎం పర్యటన సందర్భంగా భద్రత, ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి..
- రాష్ట్ర రవాణా సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) సెప్టెంబర్ 24.** కరీంనగర్ జిల్లా నూతన సమీకృత కలెక్టరేట్ భవనాన్ని ఈనెల 30న ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పండుగ వాతావరణంలో ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారంతో పాటు కార్యాలయ భవనాన్ని సుందరంగా అలంకరించాలని, స్వాగత తోరణాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవం, ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. మనకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు. కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా భవనం పరిసరాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు. ప్రధాన ద్వారం, కలెక్టర్ కార్యాలయం, ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలతో పాటు ఇతర ముఖ్య ప్రాంగణాలను సుందరంగా అలంకరించాలని ఆదేశించారు. అవసరమైన చోట్ల స్వాగత తోరణాలు ఏర్పాటు చేసి ప్రారంభోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని, ట్రాఫిక్ నియంత్రణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రతి ప్రాంతంలో అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

### తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ ప్రాంగణం పరిశీలన

సమీక్ష అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి నూతన కలెక్టరేట్ భవనాన్ని పరిశీలించారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు ఏర్పాటు చేస్తున్న ప్రాంగణాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సభ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై కూడా చర్చించారు. కలెక్టర్ నూతన ఛాంబర్, సమావేశ మందిరంతో పాటు ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను పరిశీలించారు. ముఖ్యమంత్రి రాక కోసం నూతనంగా నిర్మించిన హెలిప్యాడ్‌ను కూడా మంత్రి పరిశీలించారు. హెలిప్యాడ్‌కు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్ లో చేరుకున్న తర్వాత కలెక్టరేట్ ప్రారంభోత్సవ కార్యక్రమం లో పాల్గొని, అనంతరం నూతన కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశమై దిశానిర్దేశం చేయను న్నారు. ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనకు వెళ్లనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయా లని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సీఎం పర్యటనను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యలతో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్వో స్వామి, ఆర్డీవో షర్మిల, ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# యువత ఆరోగ్య రక్షణకే 'ఓపెన్ జిమ్'లు..గొల్లగూడెంలో నిర్మాణ పనులకు శ్రీకారం

- రూ.5 లక్షలు మంజూరు చేయించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- హుస్నాబాద్ నియోజకవర్గ క్రీడా విభాగం ఇన్‌ఛార్జి వెన్న రాజు



**సైదాపూర్ సెప్టెంబర్ 24 ( పీపుల్స్ డైరీ ) :** సైదాపూర్ మండలంలోని గొల్లగూడెం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న 'ఓపెన్ జిమ్' నిర్మాణ పనులకు హుస్నాబాద్ నియోజకవర్గ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి వెన్న రాజు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు గురువారం జిమ్ ఏర్పాటు చేసే ప్రదేశంలో ఆయన ముగ్గు పోసి పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ ఓపెన్ జిమ్ నిర్మాణ పనులను మిట్టపల్లి కిష్టయ్య చేపడుతున్నారు. ఈ సందర్భంగా వెన్న రాజు మాట్లాడుతూ.. గ్రామీణ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, సన్మార్గంలో పయనించాలనే సదుద్దేశంతో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గొల్లగూడెం గ్రామానికి ప్రత్యేకంగా రూ.5 లక్షల నిధులు మంజూరు చేయించారని తెలిపారు. యువత ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకొని దేహదారుఢ్యాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. క్రీడల ద్వారా క్రమశిక్షణను అలవర్చుకొని భవిష్యత్తులో తాము ఎంచుకున్న రంగాల్లో స్థిరపడి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బత్తుల మౌనిక-సంపత్ కుమార్, ఉప సర్పంచ్ దుస్స కుమార్, స్థానిక నాయకులు మిట్టపల్లి కిష్టయ్య, ముద్దమల్ల కిష్టయ్య, మిట్టపల్లి వెంకటయ్య, బి. రుచిందర్, బత్తుల సదయ్య, కొయ్యడ సమ్మయ్య, వేముల ఆకాష్, మహమ్మద్ అంకూష్, బత్తుల బాబు, మేకల రాజు, ముత్యాల శ్రీకాంత్, మెరుగు జ్ఞాని, రాపని అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించాలి

- చిల్వకోడూరు హెచ్‌ఎం ఆత్మహత్యాయత్నానికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి
- మధ్యాహ్న భోజన విరామంలో నల్లబ్యాడ్జీలతో సైదాపూర్ లో ఉపాధ్యాయుల నిరసన



**సైదాపూర్ సెప్టెంబర్ 24 ( పీపుల్స్ డైరీ) :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం చిల్వకోడూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆత్మహత్యాయత్నానికి కారణమైన అధికారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. అధికారుల నిరంతర పర్యవేక్షణ, ఉపాధ్యాయుల కొరతతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఆయన ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాలల్లో కేవలం ఒకరు లేదా ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. వారు ఏకకాలంలో ఐదు తరగతులకు గాను 18 సబ్జెక్టులు బోధించడంతో పాటు సుమారు 15 రకాల రికార్డుల నిర్వహణ, ఇతర బోధనేతర, హెచ్‌ఎం బాధ్యతలు మోయాల్సి వస్తోందని వాపోయారు. దీనికి తోడు అధికారుల పదేపదే తనిఖీలు, సమీక్షల వల్ల ప్రాథమిక ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జీవో ఎంఎస్ నంబర్ 25 ప్రకారం 60 మంది విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలకు కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉండాలన్న నిబంధన పూర్తిగా అశాస్త్రీయమని, అసంబ ద్ధమని వారు విమర్శించారు. ఐదు తరగతులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఏ విధంగా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. ఈ అర్థరహితమైన జీవోను తక్షణమే సవరించాలని, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేలా తగినంత మంది ఉపాధ్యాయులను నియమించి, బోధనేతర పనుల భారం తగ్గించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

# ప్రకృతి రమణీయం..సౌకర్యాలు శూన్యం-ఉరకలెత్తుతున్న రాయికల్ జలపాతం

- 12 ఏళ్లుగా పాలకుల నిర్లక్ష్యం
- కనీస మౌలిక వసతులు లేక పర్యాటకుల అవస్థలు

**సైదాపూర్ సెప్టెంబర్ 24 ( పీపుల్స్ డైరీ) :** బుధవారం సాయంత్రం నుంచి కురుస్తున్న వర్షాలకు రాయికల్ జలపాతం ఉగ్రరూపం దాల్చింది. పచ్చని చెట్లు, పక్షుల కిలకిలరావాల మధ్య జాలువారుతున్న నీటి సవ్వడులు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. సామాజిక అటవీ ప్రాంతం, మోదీన్ చెరువు మీదుగా సాగే ఈ ప్రయాణం ప్రకృతి ప్రేమికులకు ఓ మధురానుభూతి. దాదాపు 70 మీటర్ల ఎత్తు నుంచి ఐదు పాయలుగా కిందికి దుంకుతున్న ఈ జలపాతం.. రాష్ట్రంలోనే దగ్గరకు వెళ్లి నీటిలో తడిసి మురిసిపోయేలా ప్రత్యేక గుర్తింపు పొందింది. గుట్ట కింది నుంచి సుమారు 500 మీటర్లు పైకి వెళితే ఈ జలపాతపు అందాలను వీక్షించవచ్చు. ఇంతటి అద్భుత పర్యాటక కేంద్రం ప్రభుత్వాల నిర్లక్ష్యంతో వెలవెలబోతోంది.

### మూడు జిల్లాల కూడలిలో.. పర్యాటక హారంగా..

కరీంనగర్ నుంచి 55 కి.మీ, వరంగల్ నుంచి 47 కి.మీ, సిద్దిపేట నుంచి 73 కి.మీల దూరంలో మూడు జిల్లాల సరిహద్దుల్లో.. రాయికల్ గ్రామానికి 5 కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలో ఈ జలపాతం ఉంది. పన్నెండేళ్ల క్రితం సామాజిక, పత్రిక, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చిన ఈ ప్రాంతం చుట్టూ ఎన్నో చారిత్రక, పర్యాటక ప్రదేశాలున్నాయి. పశ్చిమాన బయన్న ఖిల్లా, ఆనాటి కోటల ఆనవాళ్లు, బయన్న, ఆంజనేయ స్వామి విగ్రహాలు ఉన్నాయి. సర్వాయిపేటలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం, మ్యూజియం ఏర్పాటు కానుంది. ఉత్తరాన జిల్లాలగడ్డ అర్బన్ ఫారెస్ట్ పార్క్, తూర్పున వంగరలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పార్క్.. వీటి మధ్యలో రాయికల్ జలపాతం ఉండటం విశేషం. వంగర శివారు నుంచి ఉమ్మాపూర్ శివారు వరకు ఈ గుట్టలు విస్తరించి ఉన్నాయి.

### "సందర్శనలే తప్ప.. నిధులు ఏవి?

గత 12 ఏళ్లుగా ఈ జలపాతానికి ప్రభుత్వాల నుంచి ఒక్క రూపాయి కూడా నిధులు రాలేదు. గతంలో అప్పటి కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, సీపీ కమలాసన్ రెడ్డి, అప్పటి హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్, వరంగల్ అప్పటి ఫారెస్ట్ కన్జర్వేటర్ అక్బర్, పర్యాటక శాఖ డైరెక్టర్ బుర్ర వెంకటేశం తదితరులు ఇక్కడ సందర్శించినా.. అభివృద్ధి మాత్రం శూన్యం. ప్రస్తుత ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ గత 32 నెలల కాలంలో ఈ జలపాతానికి ఎలాంటి నిధులు కేటాయించలేదు.

### నరకప్రాయంగా ప్రయాణం

రాయికల్ గ్రామం నుంచి జలపాతానికి వెళ్లే 5 కిలోమీటర్ల మట్టి రోడ్డు రెండు అడుగుల మేర గుంతలమయంగా మారి నరకాన్ని తలపిస్తోంది. కనీసం ద్విచక్ర వాహనంపై కూడా వెళ్లలేని దుస్థితి నెలకొంది. పర్యాటకులకు డ్రెస్సింగ్ రూమ్‌లు, మరుగుదొడ్లు, తాగునీరు, గుట్టపైకి వెళ్లేందుకు మెట్లు, విద్యుత్ సౌకర్యం వంటి కనీస మౌలిక సదుపాయాలు లేవు. మోదీన్ చెరువు కట్ట అభివృద్ధికి నోచుకోక పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై రాయికల్ గ్రామ సర్పంచ్ చాడ అఖిల-ప్రకాష్ రెడ్డి.. మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మూడుసార్లు కలిసి రోడ్డు మరమ్మతుల కోసం వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి.. డీఎంఎఫ్‌టీ నిధుల కింద రూ.10 లక్షలు మంజూరు చేయాలని కలెక్టర్‌కు లేఖ రాసినా, ఇప్పటికీ నిధులు విడుదల కాలేదు. వర్షాకాలం నేపథ్యంలో పర్యాటకుల తాకిడి పెరుగుతున్నందున, తక్షణమే రోడ్డు గుంతలు పూడ్చి, కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని పర్యాటకులు, స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



# వర్షం నేపథ్యంలో గణేష్ నిమజ్జన ప్రక్రియపై ప్రత్యేక పర్యవేక్షణ

**చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన వరంగల్ సీపీ, గ్రేటర్ కమిషనర్**

**నిమజ్జనం పూర్తయ్యే వరకు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశం**

**మట్టెవాడ, సెప్టెంబర్ 24 (పీపుల్స్ డైరీ) :** వరంగల్ నగరంలోని చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద కొనసాగుతున్న గణేష్ నిమజ్జన ప్రక్రియను వరంగల్ సిటీ పోలీస్ కమిషనర్ శ్వేత, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వెంకన్న గురువారం ఉదయం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిమజ్జన ప్రక్రియ కొనసాగుతున్న తీరు, భక్తుల రాకపోకలు, భద్రత, పారిశుద్ధ్య ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు నిమజ్జనం పూర్తయిన గణేశ్ విగ్రహాల సంఖ్య, ఇంకా నిమజ్జనం చేయాల్సిన విగ్రహాల వివరాలను సంబంధిత అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వర్షం కురుస్తున్న నేపథ్యంలో గణేష్ విగ్రహాలను సాధ్యమైనంత త్వరగా నిమజ్జన కేంద్రాలకు తీసుకువచ్చి నిమజ్జనం పూర్తి చేసుకునేలా ఉత్సవ కమిటీలు, నిర్వాహకులకు సూచించాలని అధికారులను ఆదేశించారు. వర్షం కారణంగా భక్తులు, నిర్వాహకులు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిమజ్జన కేంద్రాల వద్ద అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



నిమజ్జన ప్రాంతాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సీపీ శ్వేత, కమిషనర్ వెంకన్న సూచించారు. పోలీస్, మున్సిపల్, ఇరిగేషన్, వైద్య ఆరోగ్య, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా పూర్తయ్యేలా చూడాలని కోరారు. అదేవిధంగా నిమజ్జనం పూర్తైన వెంటనే విగ్రహాల అవశేషాలు, ఇతర వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని కమిషనర్ వెంకన్న ఆదేశించారు. ఈ పరిశీలనలో జిడబ్ల్యుఎంసి ఎస్.ఈ రాజ్‌కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## రాజ్ కుమార్‌కు పరామర్శ...ఆర్థిక సహాయం

**గీసుకొండ, సెప్టెంబర్ 24 (పీపుల్స్ డైరీ) :** కొమ్మాల గ్రామానికి చెందిన బోనగాని రాజ్ కుమార్ ఇటీవల కాలి శస్త్రచికిత్స చేయించుకుని అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ప్రముఖ పారిశ్రామికవేత్త, సమాజ సేవకులు అల్లం స్వప్న బాల కిషోర్ రెడ్డి, గీసుకొండ గ్రామ సర్పంచ్ వీరగోని రాజ్ కుమార్ ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ రూ.5,000 ఆర్థిక సహాయం అందించారు. ఆయన కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బట్ట మేకల శివ, సాయిలి మధు, బోగి శ్రీను, సాయిలి నరేందర్, మాడిశెట్టి కుమారస్వామి, చింతల రమేష్, జూలూరి కేదారి, మాడిశెట్టి రఘు, సాయిలి సాంబయ్య, సాయిలి వినయ్, మారబోయిన మహేందర్, మనుగొండ ఉపసర్పంచ్ యంబాడి సామ్రాజ్యం, గీసుకొండ సొసైటీ డైరెక్టర్ దౌడు సునీల్, మాజీ ఉప సర్పంచ్ పొగాకు బిక్షపతి, మాజీ ఎంపీటీసీ బానోతు శ్రీనివాస్, సాయిలి స్వామి, గుగులోతు రాజు,దశ్రు తండా టీం ఎబిఆర్ సభ్యులు బాధవత్ లాల్ సింగ్,మాజీ వార్డు మెంబర్ దౌడు రాజేష్, గాడిదల బొంద్యాలు, కొమ్మాల గణపతి యూత్ అసోసియేషన్ సభ్యులు, గ్రామ ప్రజలు, భక్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఐదుగురికి జరిమాన

**మట్టెవాడ, సెప్టెంబర్ 24 (పీపుల్స్ డైరీ):** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతారెడ్డి, ట్రాఫిక్ అదనపు డీసీపీ ఆర్.ప్రభాకర్ రావు, ట్రాఫిక్ ఏసిపి టి.సత్యనారాయణ పర్యవేక్షణలో డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఐదుగురు వ్యక్తులను వరంగల్ సెకండ్ క్లాస్ కోర్టు 3వ స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ అంకేశ్వరపు కమలాకర్ ఎదుట హాజరుపరచగా ఐదుగురు వ్యక్తులకు కోర్టు రూ.3,800 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కోదూరి సుజాత తెలిపారు.

# ప్రభుత్వ భూముల్లో అక్రమ విద్యుత్ కనెక్షన్లు

**చీకటి ఒప్పందాలతో బోరు బావులకు అనుమతులు ఇచ్చిన రెవెన్యూ అధికారులు**

**విద్యుత్ ఏడికి తుడుందెబ్బ ఫిర్యాదు**

**అక్రమ విద్యుత్ కనెక్షన్లు తొలగించాలి**

**తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి రేగ గణేష్**

**వెంకటాపురం, సెప్టెంబర్ 24 (పీపుల్స్ డైరీ) :** ఏజెన్సీలో ప్రభుత్వ భూములను మింగేసిన వ్యక్తులకు రెవిన్యూ అధికారులు వత్తాసు పలుకుతున్నారని తుడుందెబ్బ(ఆదివాసి హక్కుల పోరాట సమితి) రాష్ట్ర కార్యదర్శి రేగ గణేష్ అన్నారు. గురువారం వెంకటాపురం విద్యుత్ ఏడి బి.ఉమారావుకి తుడుందెబ్బ ఆధ్వర్యంలో అక్రమంగా పొందిన త్రీ ఫేస్ కనెక్షన్ తొలగించాలని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి రేగ గణేష్ మాట్లాడారు. ప్రభుత్వ భూములకు విద్యుత్ కనెక్షన్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. మరికల (జెడ్) రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 9లో భారీ అవినీతి జరిగిందని అన్నారు. 1/70 చట్టం అమల్లో ఉన్న వెంకటాపురం ఏజెన్సీలో గిరిజనేతరులకు ప్రభుత్వ భూములపై ఎలాంటి హక్కు లేదని గుర్తు చేశారు. అక్రమంగా ఆక్రమించడమే



చట్ట విరుద్ధమైనప్పుడు, విద్యుత్ శాఖ అధికారుల ను తప్పుదోవ పట్టించే విధంగా తప్పుడు ధ్రువపత్రాలతో విద్యుత్ శాఖ నిబంధనలకు వ్యతిరేకంగా పొందిన వ్యక్తి భూమిలో విద్యుత్ కనెక్షన్ తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. రెవిన్యూ అధికారులు లోపాయికారి ఒప్పందాల కారణంగానే ఈ అవినీతి జరిగిందని ఆరోపించారు. ఇలాంటి అధికారులపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరారు. విద్యుత్ కనెక్షన్ తొలగించన పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పూనెం మునేశ్వరరావు, పాయం కృష్ణ, పూనెం చంటి తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన సర్పంచ్



**దుగ్గొండి, సెప్టెంబర్ 24 (పీపుల్స్ డైరీ) :** నర్సంపేట శాసనసభ్యులు దొంతి.మాధవరెడ్డి ఆదేశానుసారం వెంకటాపురం గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను వెంకటాపురం గ్రామ సర్పంచ్ పొగాకు శోభారాణి వెంకటేశ్వర్లు స్థానిక గ్రామపంచాయతీ ఆవరణలో అబ్ధిదారులకు అందజేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రోజు నుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మాధవరెడ్డి ప్రజా శ్రేయస్సే పరమావదిగా పరిపాలన కొనసాగిస్తూ నియోజకవర్గ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని వారు ఆనందం వ్యక్తం చేశారు, చెక్కులు అందుకున్న వారిలో సింగిరెడ్డి భరత్ 19500, ముత్యాల మంజుల 60 వేలు,తమ ఆరోగ్య ఖర్చుల నిమిత్తం తమకు సహాయం చేసిన సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మాధవరెడ్డి కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొగాకు వెంకటేశ్వర్లు ఉప సర్పంచ్ మాటేటి రవి వార్డు సభ్యులు ఊరటి లింగం గుండెబోయిన రాజు నాంపల్లి రాజయ్య గ్రామ సీనియర్ నాయకులు పొగాకు సాంబయ్య పొగాకు సదయ్య ఏడాకుల లింగారెడ్డి ఇంగే వెంకటేష్ గుండెబోయిన రవి సారా రమేష్,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## 27న శివగంగ సేవా పురస్కారాలు ప్రాంతీయ సదస్సు




**మట్టెవాడ, సెప్టెంబర్ 24 (పీపుల్స్ డైరీ):** వాసవిక్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వి 101ఏ పరిధిలోని రీజియన్ -3 ప్రాంతీయ సదస్సు "శివగంగ సేవా పురస్కారాలు" పేరిట ఈనెల 27న ఆదివారం వరంగల్ రామన్నపేటలోని ఏవిఎస్ కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసినట్లు రీజియన్ చైర్మన్ డాక్టర్ సోమ శ్రీధర్ వెల్లడించారు. వాసవిక్లబ్ కేసిజిఎఫ్ డాక్టర్స్ వరంగల్ ఆతిథ్యంతో ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సులో వాసవిక్లబ్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షులు దోసపాటి వెంకటేశ్వర్ రావు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. రీజియన్-3 పరిధిలోని 8 క్లబ్బుల పిఎస్.టిలు సదస్సుకు హాజరై బ్యానర్ ప్రెజెంటేషన్ అనంతరం 2026 లో చేసిన సేవా కార్యక్రమాలకు గాను అవార్డులు స్వీకరించాలని ఆయన కోరారు. వాసవియన్లు, వాసవి వనితలు అధిక సంఖ్యలో హాజరై సదస్సును జయప్రదం చేయాలని డాక్టర్ శ్రీధర్ కోరారు.

# భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి!

**అత్యవసర సేవలకు కంట్రోల్ రూమ్ 9701999645 టోల్‌ఫ్రీ: 1800 425 1980 వాట్సాప్: 9701999676 నెంబర్లను సంప్రదించాలి**

**- రెస్క్యూ బృందాలు, యంత్రాలు సిద్ధంగా ఉంచాలి**

**- అధికారులతో టెలి కాన్ఫరెన్స్‌లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న ఆదేశాలు**

**మట్టెవాడ, సెప్టెంబర్ 24 (పీపుల్స్ డైరీ) :** రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించిన నేపథ్యంలో గ్రేటర్ వరంగల్ నగర ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్న తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో నగరంలో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గురువారం జీడబ్ల్యూఎంసీ ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్, డీఆర్ఎఫ్ తదితర విభాగాల అధికారులతో కమిషనర్ టి.వెంకన్న టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలో వర్షాల పరిస్థితి, నీటిముంపు ప్రాంతాలు, అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలు, సిబ్బంది, యంత్రాల అందుబాటు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రతి విభాగం అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన చోట తక్షణమే స్పందించాలని కమిషనర్ సూచించారు. విభాగాల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేసుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు జెసిబిలు, డీవాటరింగ్ మోటార్లు, ట్రాక్టర్లు, ఇతర అవసరమైన యంత్రాలు, పరికరాలను సిద్ధంగా ఉంచాలని కమిషనర్ ఆదేశించారు. అవసరమైన ప్రాంతాలకు సిబ్బంది, యంత్రాలను ఆలస్యం లేకుండా తరలించేలా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. చెట్లు విరిగిపడటం, రహదారులపై వరదనీరు నిలవడం, విద్యుత్



సంబంధిత సమస్యలు, నాలాలు పొంగిపొర్లడం లేదా ఇతర అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే సంబంధిత అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. భారీ వర్షాల కారణంగా ప్రమాద పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్న లోతట్టు ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని కమిషనర్ ఆదేశించారు. పరిస్థితులు తీవ్రతరమైతే ఆయా ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని, అవసరాన్ని బట్టి సురక్షిత ప్రాంతాలు, సహాయక/పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్, డీఆర్ఎఫ్ తదితర విభాగాల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నగరంలోని పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ సూచించారు. ప్రజల నుంచి వర్షాలు, చెట్లు విరిగిపడటం తదితర సమస్యలపై ఫిర్యాదులు, సమాచారాన్ని స్వీకరించేందుకు జిడబ్ల్యుఎంసి ప్రధాన కార్యాలయంలో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు టోల్‌ఫ్రీ: 1800 425 1980 కంట్రోల్ రూమ్: 9701999645 వాట్సాప్: 9701999676 నెంబర్లను సంప్రదించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని, అధికారుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ టి. వెంకన్న కోరారు. ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ జీడబ్ల్యూఎంసీ యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉందని, ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు రెస్క్యూ, డిఆర్ఎఫ్ బృందాలు, సిబ్బంది, యంత్రాలు సిద్ధంగా ఉన్నాయని కమిషనర్ వెంకన్న తెలిపారు.

## గంజాయి నిందితుడి ఆస్తులు జప్తు

**పినపాక, సెప్టెంబర్ 24(పీపుల్స్ డైరీ) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలం, ఉప్పాక బ్రిడ్జి వద్ద 2025 ఆగస్టు 28న వాహన తనిఖీలను ఎస్సై సురేష్ సిబ్బంది సహకారంతో చేస్తుండగా గంజాయి అక్రమ రవాణా చేస్తున్న పల్లపు రఘు (తండ్రి ఎల్లయ్య, 35 సం) అనే వ్యక్తి అదుపులోకి తీసుకోవడం జరిగింది. ఈ కేసు కు సంబంధించి జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి 24.09.2026న పత్రికా ప్రకటన విడుదల చేశారు.ఏడూళ్ల బయ్యారం పోలీస్ స్టేషన్‌లో 28.08.2025న నమోదైన ఫ్రైజూ://జతీ.చీశీ.136/2025, ఖ/ావష 8(జ) తీ/ష 20(ఎ)(అఅ)(జ), 27(ూ), 29 శీట చీణూూ-ూష్-1985 కేసులో నిందితుడైన పల్లపు రఘు ఆస్తులపై, ఆర్థిక స్థితిగతులపై విచారణ నిర్వహించడం జరిగిందని,విచారణలో నిందితుడు గంజాయి అక్రమ రవాణా ద్వారా సంపాదించినట్లు గుర్తించిన రెండు కార్లు, ఒక మోటార్ సైకిల్, అతని భార్య బ్యాంక్ ఖాతాను చెన్నై కాంపిటెంట్ అథారిటీ ద్వారా ఫ్రీజింగ్ ఆర్డర్ పొంది, కోర్టు ఉత్తర్వుల మేరకు జప్తు చేసినట్లు ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. జప్తు చేసిన ఆస్తుల విలువ సుమారు రూ.21,15,907గా ఉందని అన్నారు. నిందితుడు పల్లపు రఘు, (35) కారు డ్రైవర్, స్వస్థలం మండేపల్లి, చిన్నకోడూర్ మండలం, సిద్దిపేట జిల్లా, ప్రస్తుతం ఉప్పల్, హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడని తెలిపారు.గంజాయి వంటి నేరాల ద్వారా సంపాదించిన ఆస్తులను గుర్తించి జప్తు చేసేందుకు నిరంతరం చర్యలు చేపడుతున్నట్లు సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. నిందితుడిని అరెస్టు చేయడమే కాకుండా ఆస్తుల జప్తు వరకు సమర్థవంతంగా దర్యాప్తు చేసిన సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ సురేష్ ని, స్టేషన్ సిబ్బందిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ అభినందించారు.



## లడ్డును కైవసం చేసుకున్న ఎస్కే షరీఫ్

**దుగ్గొండి, సెప్టెంబర్ 24 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని తిమ్మంపేట గ్రామంలో స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాల్లో లడ్డును వేలంపాటలో రు.9116 రూపాయలకు ముస్లిం కుటుంబానికి చెందిన ఎస్కే షరీఫ్ కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ లడ్డును కైవసం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. వినాయక పండుగ సందర్భంగా అందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు భాషబోయిన సురేష్, వేణు,నరేష్, రాజేందర్, రాజు, రవి, ఎలకంటి కుమారస్వామి, మధుసూదన్, మహేష్, దండు రాజు పాల్గొన్నారు.



# గణపయ్య మహిమతో వర్ష రూపంలో దిగొచ్చిన గంగమ్మ

## పరవశించిన భక్తజనం!

**నర్సంపేట, సెప్టెంబర్ 24 (పీపుల్స్ డైరీ) :** రేకంపల్లిలో ఘనంగా వినాయక నిమజ్జన వేడుకలు ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడి, పంటలు ఎండిపోయి ప్రజలు అల్లాడిపోయిన వేళ.. వినాయక చవితి పండగ వేళ అద్భుతం ఆవిష్కృతమైంది. విఘ్నేశ్వరుని రాకతో భాద్రపద మాసంలో వర్షాలు కురవడమే కాకుండా, నిమజ్జనం వేళకు గంగమ్మ తల్లి స్వయంగా దిగొచ్చి చెరువులను జలకళతో నింపేసింది.

**వర్షాభావంతో అల్లాడిపోయిన జనం**

ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం వల్ల ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదు. తాగునీరు, సాగునీరు దొరక్క రైతులు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చవితి నవరాత్రుల ఉత్సవాలు ముగిసి, నిమజ్జనం



సమయం ఆసన్నమయ్యేసరికి స్థానిక చెరువులు, కుంటల్లో బొట్టు నీరు కూడా లేకపోవడంతో భక్తులు తీవ్ర ఆందోళన చెందారు. "తమ ఇళ్లలో ప్రతిష్టించిన ముద్దుల గణపయ్యను ఎక్కడ నిమజ్జనం చేయాలి?" అని దిక్కుతోచని స్థితిలో దేవుడికే మొరపెట్టుకున్నారు.

**గణపయ్య రాకతో తొలకరి జల్లులు**

భక్తుల కష్టాలను, ఆర్తిని ఆలకించిన ఆ విఘ్ననాయకుడు తన మహిమను చాటాడు. నవరాత్రుల ప్రారంభంలోనే తొలకరి జల్లులతో అలరించిన గణనాథుడు, నిమజ్జనం సమయానికి కరుణాకటాక్షాలు కురిపించాడు. గంగమ్మ తల్లిని ప్రసన్నం చేసుకుని చెరువులు, కుంటలు నిండేలా భారీ వర్షాన్ని ప్రసాదించాడు. నిమజ్జనానికి నీళ్లు లేక దిగులుపడ్డ భక్తుల కళ్ల ముందే కుంటలు, చెరువులు జలకళతో తొణికిసలాడాయి.

**ముక్కోటి దేవతల ప్రథమ పూజ్యుడ**

పార్వతీపరమేశ్వరుల ముద్దుల తనయుడు, ఏ పూజ చేసినా, ఏ కార్యం తలపెట్టినా ముక్కోటి దేవతల కంటే ముందుగా పూజలందుకునే విఘ్నరాజు మహిమతో ఊరంతా పండగ వాతావరణం సంతరించుకుంది. గంగమ్మ దయతో సమృద్ధిగా నీరు చేరడంతో భక్తులు అత్యంత వైభవంగా, జై గణేష్ నామస్మరణల మధ్య వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. 'ఏ విఘ్నం రాకుండా కాపాడే లంబోదరుడు, తమ నిమజ్జనానికి నీటి కొరత లేకుండా గంగమ్మనే రప్పించాడని" స్థానిక భక్తులు ఆనందంతో పరవశించిపోతున్నారు. గణపయ్య అనుగ్రహంతో పాడిపంటలు సమృద్ధిగా పండాలని సమస్త ప్రజానీకం వేడుకున్నారు.

# నాణ్యమైన బొగ్గును సరఫరా చేయాలి

## బీటీపీఎస్ గేటు వద్ద బీఆర్ఎస్ మహా ధర్నా





**పినపాక, సెప్టెంబర్ 24,(పీపుల్స్ డైరీ) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ,పినపాక మండల సరిహద్దున నిర్మితమైన భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ప్రధాన ద్వారం వద్ద బిఆర్ఎస్ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపుమేరకు మహాధర్నా కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పినపాక నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే , భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు ఆధ్వర్యంలో నిర్వహించిన మహా ధర్నా కార్యక్రమానికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పాల్గొన్నారు. మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీగా మోహరించిన పోలీస్ భద్రత బలగాల నడుమ చేపట్టిన ఈ మహా ధర్నా కార్యక్రమంలో భారీ సంఖ్యలో హాజరైన బి.ఆర్.ఎస్ కార్యకర్తలు నాయకులతో ఉద్రిక్త వాతావరణ పరిస్థితులు చోటుచేసుకున్నాయి. మహాధర్నాను ఉద్దేశించి మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, పినపాక నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మాట్లాడుతూ పాకిస్తాన్లో ఉన్నామా... భారతదేశంలో ఉన్నామా అనే సందేహం వస్తుందని , నీళ్లు, నిధులు, నియామకాలు అనే ప్రధాన ఉద్దేశాలతో ఎన్నో సంవత్సరాలు కొట్లాడి కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని, రాష్ట్రంలో ప్రజల అవస్థలు గుర్తించి, పారిశ్రామిక అభివృద్ధి సాధించాలంటే విద్యుత్ రంగం చాలా ప్రథమ పాత్ర పోషిస్తుందని కేసీఆర్ ముందుచూపుతో సింగరేణి ప్రాంతమైన పినపాక, మణుగూరు మండలాల సరిహద్దు ప్రాంతంలో నిర్మితమైన భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఆ రోజున ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన బెల్ ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో నిర్మించారన్నారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం అసమర్థ పాలన వలన బిటిపిఎస్‌లో నిర్మితమైన నాలుగు యూనిట్లకు గాను, రెండు యూనిట్ల ద్వారా మాత్రమే విద్యుత్ ఉత్పత్తి చేయడం విడ్డూరంగా ఉందఅన్నారు. నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేయని సింగరేణి సంస్థపై ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని, సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలను చెల్లించకుండా ఆ సంస్థని నిర్వీర్యం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుందని మండిపడ్డారు.ప్రజాస్వామ్యబద్ధంగా చేస్తున్న ఈ నిరసన కార్యక్రమానికి ప్రజా ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం అనుమతులు ఇవ్వకపోవడం నియంత పాలనకు నిదర్శనంగా ఉందని,అసమర్థ పాలన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరలోనే తెలంగాణ ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు." అంగట్లో అన్నీ ఉన్న అల్లుడి నోట్లో శని" అనే చందాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన ఉందని తెలంగాణ రాష్ట్ర వనరులని సరైన పద్ధతిలో ఉపయోగించుకోలేని అసమర్థ పాలన చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి

### భారీ వర్షాల నేపథ్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా కలెక్టర్లతో మాట్లాడిన మంత్రి తుమ్మల...

**ఖమ్మం, సెప్టెంబర్ 24 (పీపుల్స్ డైరీ) :** గత రెండు రోజులు నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గురువారం సాయంత్రం ఉమ్మడి ఖమ్మం జిల్లా కలెక్టర్లతో మంత్రి తుమ్మల హైదరాబాదు నుండి చరవాణి ద్వారా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రధాన జలాశయాల్లో నీటిమట్టం వాటి వివరాలు, లోతట్టు ప్రాంతాల పరిస్థితి తో పాటు ఇతర అంశాలపై అడిగి తెలుసుకుని మంత్రి తుమ్మల అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రానున్న రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. ప్రధానంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్న పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వాగులు వంకలు, పొంగి పొరలే అవకాశమున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి తుమ్మల తెలిపారు.



## ఏన్కూరులో ఎడతెరిపి లేని వర్షాలు

### అంతర్గత రోడ్లు జలమయం - పత్తికి నష్టం

**ఏన్కూరు, సెప్టెంబర్ 24 (పీపుల్స్ డైరీ) :** ఏన్కూరు మండలంలో గత రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ఫలితంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చేతికొచ్చిన పత్తి నేల రాలిపోతున్నది. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి, పంట పండించి చేతికొస్తున్న తరుణంలో వర్షాలు దెబ్బ తీస్తున్నాయి. మరోవైపు వర్షాలతో అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. పంట పొలాల్లోకి నీరు చేరింది. చెరువులు ,వాగు లలోకి నీరు చేరుకుంటు న్నది. ఎల్‌నినో ప్రభావంతో ఇబ్బంది పడుతున్న రైతులకు ఈ వర్షాలు ఊరట ఇస్తున్నాయి.

## ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవం

**ఏన్కూరు, సెప్టెంబర్ 24 (పీపుల్స్ డైరీ) :** మండల వ్యాప్తంగా వైభవంగా నిర్వహించిన గణేష్ ఉత్సవాలు గురువారం రాత్రితో ముగిశాయి. మండల పరిధిలోని టిఎల్ పేట బైపాస్ రోడ్డులో నిర్వహించిన గణేష్ ఉత్సవాలు ముగియటంతో నిమజ్జనోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మేళ తాళాలు యువతి యువకుల నృత్యాలతో, ఆనందోత్సాహాల నడుమ వినాయకుడి శోభాయాత్ర నిర్వహించి గణేష్ నిమజ్జనోత్సవం ఘనంగా జరిపారు .జై జై గణేశా, బై బై గణేశా అంటూ గణనాథుడికి వీడ్కోలు పలికారు. జోరు వర్షంలోనే నిమజ్జనం జరిపారు.



## అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వ చర్యలు

### ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్

**ఏన్కూరు, సెప్టెంబర్ 24 (పీపుల్స్ డైరీ) :** అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధి కోసం ప్రజాపాలన ప్రభుత్వం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని, వైరా ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ అన్నారు. గురువారం ఏన్కూర్ రైతు వేదిక నందు కామేపల్లి ప్రాజెక్టు పరిధిలోని ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సామూహిక శ్రీమంతాలు, అక్షరాభ్యాస కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అందించే మెనూ ప్రకారం అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికమైన ఆహారం అందించాలని ఆయన నిర్వాహలకు సూచించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలనలో అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కోట్ల రూపాయల ఖర్చు చేసిందని ఆయన అన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. మహిళల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించడం ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కిందన్నారు. అనంతరం మండలం అంగన్వాడీ కేంద్రాల నిర్వహకులు ఏర్పాటుచేసిన పౌష్టిక ఆహార స్టాల్స్ ను ఆయన పరిశీలించారు. మహిళల



సామూహిక సీమంత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ అధికారి, ఏ ప్రమీల రాణి, కామేపల్లి సిడిపిఓ, ఉమా, ఎంపీడీవో, భాగ్యశ్రీ, ఎమ్మార్వో, శేషగిరిరావు, సూపర్వైజర్లు భవాని, బక్కమ్మ, ఏన్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ లచ్చిరామ్ నాయక్,కాంగ్రెస్ నాయకులు మేడ ధర్మారావు, సామేలు,పంతగాని నరేష్, అంగన్వాడీ కేంద్ర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాల వారికి ఎమ్మెల్యే రామదాసు నాయక్ చేతుల మీదగా స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు.

## అందుబాటులో శనగ విత్తనాలు



**శాయంపేట, సెప్టెంబర్ 24,(పీపుల్స్ డైరీ) :** జాతీయ ఆహార భద్రతా మిషన్--పప్పుధాన్యాల (ఎన్ఎఫ్ఎస్ఎం--ఎంఎఎన్పి) పథకం కింద బెంగాల్‌గ్రామ్ (శనగ) విత్తనాలు 1,512 కిలోలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవ సాయ అధికారి మార్క ప్రియదర్శిని ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇవి ఎన్ బిఈజి-452 రకం విత్తనాలు, విత్తనాల పూర్తి ధర 1,392 రూపాయలు, ప్రభుత్వ సబ్సిడీ 960 రూపాయలు,రైతు వాటా 432 రూపాయలు అని తెలిపారు. ఆసక్తి గల రైతులు తమ సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ)ని సంప్రదించి,పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, రైతు ఐడీ జిరాక్స్ ప్రతులను సమర్పించాలి. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, విత్తనాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలిపారు.

## పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న పోలీస్ వాహనాన్ని ఢీకొన్న లారీ

### ఎస్సై , డ్రైవర్ కు తీవ్ర గాయాలు-- ఆసుపత్రిలో పరామర్శించిన పోలీస్ కమిషనర్



**ఖమ్మం, సెప్టెంబర్ 24 (పీపుల్స్ డైరీ) :** రాత్రి పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న పోలీస్ వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో ఎస్సైతో పాటు పోలీస్ వాహన డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీస్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం తిరుమలాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీశ్ పరిస్థితి నిలకడగా వుంది, డ్రైవర్ కొత్తపల్లి రాకేష్ కు మెరుగైన వైద్య చికిత్స కోసం హైదరాబాద్ కు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ రాత్రి ఆసుపత్రికి చేరుకుని గాయపడిన ఎస్సై, డ్రైవర్‌ను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం రాకేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా నిరంతరం పరిస్థితిని పర్యవేక్షించాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. విధినిర్వహణ లో భాగంగా రాత్రి పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకోవడం పట్ల పోలీస్ కమిషనర్ విచారం వ్యక్తం చేశారు. గాయపడిన సిబ్బంది త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బుధవారం అర్ధరాత్రి పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు నుంచి ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కు చేపల లోడుతో వెళ్తున్న ఏపి-16-టిహెచ్ - 6179 నంబర్ గల లారీ తిరుమలాయపాలెం గ్రామ శివారులోని భవానీ హోటల్ సమీపంలో ఎదురుగా వస్తున్న పోలీస్ వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. లారీ డ్రైవర్ షేక్ రసూల్ (65) వాహనాన్ని వేగంగా నడుపుతూ ఢీకొట్టినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తెలిసింది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. లారీ డ్రైవర్‌పై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునేలా అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.



## బీజేపీకి తొత్తుగా ఈసీ

### డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్

**ఖమ్మం, సెప్టెంబర్ 24 (పీపుల్స్ డైరీ) :** కేంద్ర ఎన్నికల సంఘం సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పేరుతో దేశవ్యాప్తంగా కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీల ఓట్లను లక్ష్యంగా చేసుకుని తొలగిస్తోందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఘాటుగా విమర్శించారు. శుక్రవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ... ఈసీ తాజాగా సుప్రీంకోర్టులో వేసిన అఫిడవిట్ పూర్తిగా అసమంజసంగా ఉందన్నారు. "అనుమానాలను స్వీకరించం, ఆ అంశాన్ని కమిషన్ పరిశీలిస్తుంది అని క్యాబినెట్ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లామని సమాధానం చెప్పడం సిగ్గుచేటు. 10 ఏళ్లలో 14 సార్లు ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఇలా చట్టవిరుద్ధంగా చర్యలు చేపట్టారని వారిలో ఆరోపించారు. 2025 జూన్ నుండి ఇప్పటిదాకా సర్‌లో భాగంగా 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 13 కోట్లకు పైగా ఓట్లను తొలగించారు. ఇది ఓట్ల తొలగింపు కాదు, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే" అని ఆయన మండిపడ్డారు. ఈసీ తీరుపై దేశవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవుతోందని, అందుకే ఢిల్లీలో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు సీఈసీ జ్ఞానేష్ కుమార్ కు వ్యతిరేకంగా నిరసన తెలిపారని గుర్తుచేశారు.

### బీజేపీతో కలిసి ఓట్ల చోరీకి కుట్ర

"బీజేపీ, ఆరెస్సెస్, ఈసీలు కలిసి ఓట్ల చోరీ ద్వారా దేశద్రోహ చర్యకు పాల్పడుతున్నాయి. బీహార్, మహారాష్ట్ర, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ లో నిరసనలు చినఆసాంతం ఎన్నికలను రద్దు చేసి మళ్ళీ బ్యాలెట్ పేపర్ తో ఎన్నికలు నిర్వహించాలి. సీఈసీ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి, ఆయనను అరెస్టు చేయాలి. గతేదాది కాలంలో ఈ నిర్ణయాలను పూర్తి కమిషన్ ఏకగ్రీవంగా తీసుకోలేదు, కేవలం కొందరు అధికారుల ఇష్టానుసారంగా జరుగుతోంది" అని ఆయన ఆరోపించారు. ఈసీ తీరు బ్రిటిష్ పాలనను తలపిస్తోందని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీ వీధి పోరాటం చేస్తుందని, దేశ ప్రజలు ఎప్పుడో బీజెపి పార్టీని అభిశంసించారని, ఈ పోరాటం ఆగదని నూతి సత్యనారాయణ గౌడ్ స్పష్టం చేశారు.

# భారీ వర్షాలతో పొలాల్లో పెరిగిన తేమ

## పంటలకు ఒకవైపు ఊరట.. మరోవైపు అధిక వర్షంతో నష్టం ముప్పు

**మణుగూరు, సెప్టెంబర్ 24 (పీపుల్స్ డైరీ) :** రెండు రోజులుగా కురు స్తున్న భారీ వర్షాలతో మణుగూరు పరిసర ప్రాంతాల్లో వాతావరణం పూర్తిగా మారిపోయింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పొలాల్లో తేమ శాతం పెరిగింది. ఇప్పటికే సాగులో ఉన్న పంటలకు ఈ వర్షాలు కొంతమేర ప్రయోజనకరంగా మారినప్పటికీ, వర్షం ఇదే స్థాయిలో మరికొంతకాలం కొనసాగితే లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి పంటలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. వర్షాభావ పరిస్థితుల మధ్య సాగు చేస్తున్న రైతులకు తాజా వర్షాలు కొంత ఊరటనిస్తున్నా యి. భూమిలో తేమ పెరగడంతో పంటలకు అవసరమైన నీరు అందుతోంది. ముఖ్యంగా వర్షాధారంగా సాగు చేస్తున్న ప్రాంతాల్లో ఈ వర్షాలు పంటల ఎదుగుదలకు ఉపయోగపడే పరిస్థితి కనిపిస్తోంది. అయితే పొలాల్లో నీరు ఎక్కువసేపు నిలిచిపోతే పంటలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండటంతో రైతులు పొలాలను పరిశీలిస్తున్నారు.

### నీటి నిల్వపై రైతుల దృష్టి

వరి, పత్తి, మిరప తదితర పంటలు సాగులో ఉన్న ప్రాంతాల్లో వర్షాల ప్రభావం పంటలపై ఎలా ఉందనే దానిపై రైతులు అంచనా వేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో పొలాల్లో నీరు నిలిచే పరిస్థితి కనిపిస్తుండగా, మరికొన్ని ప్రాంతాల్లో వర్షపు నీరు బయటకు వెళ్లిపోతోంది. వరుసగా భారీ వర్షాలు కురిస్తే నీటి పారుదల సక్రమంగా లేని పొలాల్లో పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయ భూముల్లో నీటి నిల్వ ఎక్కువైతే పంట వేర్లకు గాలి అందక పంట ఎదుగుదలపై ప్రభావం పడే అవకాశం ఉంది. దీంతో రైతులు పొలాల్లో నీటి నిల్వను గమనిస్తూ, అవసరమైన చోట నీరు బయటకు వెళ్లే మార్గాలను పరిశీలిస్తున్నారు.

### అధికారుల పర్యవేక్షణ అవసరం

వర్షాల తీవ్రత దృష్ట్యా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితిని పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఏయే గ్రామాల్లో ఎంత మేర పంటలు సాగులో ఉన్నాయి? ఎక్కడైనా నీరు నిలిచిందా? పంటలకు నష్టం వాటిల్లే పరిస్థితి ఉందా? అనే అంశాలపై అధికారులు పరిశీలన చేపట్టాల్సి ఉంది. అలాగే వర్షాలు మరికొన్ని రోజులు కొనసాగితే పంటలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వ్యవసాయ శాఖ నుంచి సూచనలు అందించాల్సిన అవసరం ఉంది. పంటల పరిస్థితిపై ముందస్తు అంచనా వేసి అవసరమైన సూచనలు అందిస్తే రైతులు కూడా నష్టాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుంది.

### వర్షం రైతుకు వరమా.. భారమా?

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఒకవైపు భూమికి తేమను అందిస్తూ పంటలకు ఉపయోగపడుతున్నాయి. మరోవైపు వర్షపాతం అధికమై పొలాల్లో నీరు నిలిచే పరిస్థితి ఏర్పడితే అదే వర్షం పంటలకు నష్టాన్ని కలిగించే అవకాశం ఉంది. దీంతో ప్రస్తుతం రైతుల దృష్టంతా వర్షం తీవ్రత, పొలాల్లో నీటి నిల్వ, పంటల పరిస్థితిపైనే ఉంది. వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి పంటల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని రైతులు కోరుతున్నారు. పంట నష్టం చోటుచేసుకుంటే వెంటనే గుర్తించి నమోదు చేసే విధంగా క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ ఉండాలని వారు కోరుతున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com

# కేయూలో అట్టహాసంగా జాతీయ సేవా పథకం వ్యవస్థాపక దినోత్సవం







పీపుల్స్‌డైరీ–హనుమకొండ : కాకతీయ విశ్వవిద్యాలయం 50 సంవత్సరాల వసంతాలను జరుపుకుంటున్న సందర్భంలో జాతీయ సేవా పథకం సెల్ కాకతీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించబడింది. జాతీయ సేవా పథకం సెల్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసన్ నారాయణ అధ్యక్షతన నిర్వహించబడిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి హాజరైనారు. విశిష్ట అతిథులుగా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వీ రామచంద్రం, గతంలో విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం సెల్ కోఆర్డినేటర్లుగా పనిచేసిన ప్రొఫెసర్ సీతారాం నాయక్, ప్రొఫెసర్ వెంకటనారాయణ, ప్రొఫెసర్సురేష్ లాల్, ప్రొఫెసర్ జ్యోతి, ఎం శంకరయ్య ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రొఫెసర్ కిష్టయ్య, థామస్, ప్రొఫెసర్ జి బాలస్వామి, ప్రొఫెసర్ మనోహర్ ప్రిన్సిపల్ యూనివర్సిటీ కళాశాల , రమణ,ప్రొఫెసర్ బెనర్జీ హాజరైనారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ కార్యక్రమం గురించి వివరిస్తూ కాకతీయ విశ్వవిద్యాలయం 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో జాతీయ సేవా పథకం గత కాలం నుండి నేటి వరకు సేవలందించిన ప్రోగ్రాం కోఆర్డినేటర్లను, ప్రోగ్రాం ఆఫీసర్లను, సీనియర్ వాలంటీర్లను ఒకే వేదిక పైకి తీసుకువచ్చి సన్మానం చేయడం ద్వారా ప్రస్తుతం వాలంటీర్లలో ఉత్సాహాన్ని నింపడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశం గా తెలియజేశారు.

గతంలో పనిచేసిన జాతీయ సేవా పథకం కోఆర్డినేటర్లు వారి అనుభవాలను పంచుకున్నారు. వివిధ విపత్కర పరిస్థితులలో వాలంటీర్లు అందించిన సేవలను గుర్తు చేసినారు. రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలుగా మిగిలిన సందర్భాలను గుర్తు చేశారు. ముఖ్యఅతిథి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఒకే వేదిక పైకి ఇంతమందిని తీసుకురావడం అభినందనీయమన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకంకు ప్రత్యేక భవన నిర్మాణానికి కృషి చేస్తామని తెలియజేశారు. విశ్వవిద్యాలయం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు వాలంటీర్లు వివిధ రంగాలలో స్థిరపడిన వారు వేదికపై ఆసీనులై వారి కళా ప్రతిభను చాటినారు. జబర్దస్త్ టీం కళాకారులు గాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ గా ప్రవీణ్ వ్యవహరించగా వివిధ జిల్లాల కన్వీనర్లు ,వివిధ కళాశాల ప్రోగ్రాం అధికారులుకార్యక్రమానికి హాజరైనారు .వివిధ కళాశాలల వాలంటీర్లు నృత్యంప్రదర్శనలు గేయాలు పాడడం, పాటలు పాడడం జరిగినది . వందన సమర్పణ తో కార్యక్రమం ముగిసినది

## యుద్ధ భూమి కాకతీయ యూనివర్సిటీ ఫుల్ సాంగ్ విడుదల

కాకతీయ యూనివర్సిటీ 50 వ వసంతాల సందర్భంగా యూనివర్సిటీ ఆడిటోరియంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాపరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్ర చేతులమీదుగా సాంగ్ విడుదల చేయడం జరిగింది. 50 సంవత్సరాల కాకతీయ యూనివర్సిటీ ఆవిర్భావం నుండి నేటి వరకు చరిత్రను, తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం కొట్లాడిన విద్యార్థి పోరాటం. మహనీయులు కలలుగన్న సమాజాన్ని విద్యార్థులు అందిపుచ్చుకునే సామాజిక కార్యక్రమాల విధానం గూర్చి యూనివర్సిటీ లో పరిశోధక పరిశోధనలు ఉన్నతమైన చదువును కలగలిపి యూనివర్సిటీ యొక్క ఉన్నతినీ కొనియాడే విధంగా పాట రాయడం జరిగింది. 50 సంవత్సరాల కాలంలో మొట్ట మొదటిసారిగా ఈ పాట రాయడం విశేషం. ఈ పాట నేరెళ్ల దేవేందర్ రచించగా ఇనుగుర్తి మధు పాడటం జరిగింది. ఈ యూనివర్సిటీ పాటకు సహకరించిన రాచకొండ ప్రవీణ్, గుంపెల్లి గౌతమ్, నిర్మాతలు ఎల్తూరి సాయికుమార్ శ్రీనాథ్, మ్యూజిక్ డైరెక్టర్ ప్రశాంత్, ఎడిటర్ ఆర్య అరవింద్, డిఓపి అరవింద్ నాని, డ్రోన్ పైలెట్ దేశెట్టి నవీన్ ట్యూన్ పాక రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# పేద నిరుద్యోగ యువతకు టిఆర్పీ సుమార్గ్ అండ

- కరీంనగర్ జిల్లాలో ఎస్ఐ, పీసీ, ఎఫ్‌బీఓ ఉచిత కోచింగ్
- ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్
- ప్రభుత్వ ఉద్యోగ లక్ష్యానికి ఉచిత కోచింగ్ : మాదం రజిని కుమార్ యాదవ్
- ఆర్థిక పరిస్థితి కాదు, పట్టుదలే భవిష్యత్తును నిర్ణయిస్తుంది : రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా




కరీంనగర్ సెప్టెంబర్ 24 పీపుల్స్ డైరీ
తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిరుద్యోగ యువత కోసం ఏర్పాటు చేసిన టిఆర్పీ సుమార్గ్ ఎస్ఐ, పీసీ, ఎఫ్‌బీఓ ఉచిత కోచింగ్ కార్యక్రమం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీఆర్పీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజిని కుమార్ హాజరై రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల నుంచి కోచింగ్‌కు సంబంధించిన అప్లికేషన్ దరఖాస్తులను స్వీకరించారు.

ఈ సందర్భంగా మాదం రజిని కుమార్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం విద్యార్థులు సరైన మార్గదర్శకత్వం, నాణ్యమైన కోచింగ్ మరియు నిరంతర సాధన పొందాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ఆర్థిక స్థోమత లేని పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు ప్రైవేట్ కోచింగ్ కేంద్రాల ఫీజులు భారంగా మారుతున్న పరిస్థితుల్లో టీఆర్పీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా తన సొంత ఖర్చుతో నిరుద్యోగ విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ అందించే కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం కోచింగ్‌కు హాజరవడం మాత్రమే కాకుండా ప్రతిరోజూ క్రమశిక్షణతో చదువుతూ, మాక్ టెస్టులు రాస్తూ, సమయపాలన పాటిస్తూ తమ లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకు సాగాలని వారు సూచించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా మాట్లాడుతూ, తన జీవితంలో ఎదురైన ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువును కొనసాగించడంలో తాను ఎదుర్కొన్న పరిస్థితులను గుర్తు చేసుకున్నారు. ఆర్థిక పరిస్థితులు కారణంగా ప్రతిభ ఉన్న ఎంతోమంది విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారని, అలాంటి విద్యార్థులకు తన వంతుగా సహాయం చేయాలనే ఉద్దేశంతో టీఆర్పీ సుమార్గ్ ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. నాకు ఎదురైన ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువులో వచ్చిన కష్టాలు నాకు తెలుసు. అందుకే లక్ష్యం పెట్టుకుని ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనుకునే విద్యార్థులకు ఆర్థిక పరిస్థితి అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో ఈ ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాను. కోచింగ్ ఫీజులు చెల్లించలేని విద్యార్థులు కూడా మంచి శిక్షణ పొందాలి, పోటీ పరీక్షల్లో విజయం సాధించాలి అనేదే నా లక్ష్యం అని అఖిల్ పాషా తెలిపారు. కేవలం ఉద్యోగం కోసం కాకుండా, కుటుంబానికి మరియు సమాజానికి ఉపయోగపడే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఎస్సార్ ఐఏఎస్ అకాడమిక్ డైరెక్టర్ కరీమ్ రోజు సార్, హన్మకొండ జిల్లా అధ్యక్షులు పూజారి సత్తన్న, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, మహిళా అధ్యక్షురాలు రాచరి అరుణ దేవి, కార్యదర్శి ఇశ్రత్ శావాలి, జిల్లా మైనారిటీ అధ్యక్షులు మొహ్మద్ వాజిద్, ప్రధాన కార్యదర్శి అంకుష్ శావాలి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్షత్ బిన్ అలీ, రాష్ట్ర మహిళ ఉపాధ్యాక్షురాలు జింక లావణ్య, రాష్ట్ర యూత్ సహాయ కార్యదర్శి మహబూబ్ అలీ, పెద్దపెల్లి కార్మిక అధ్యక్షుడు ఉదయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చిగుర్ల మోహన్, జిల్లా కార్యదర్శి దాట్ల శ్రీనివాస్, మండలాల అధ్యక్షులు, యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంతెన శ్రీకాంత్, నాయకులు ఎగుర్ల రమేష్, శివరాత్రి మోహన్, అనిల్, ఓర్సు రాజు, గుండోజు సాధానందం, కుమార్, రాజు, వెంకట్ గౌడ్, వాసాల భాను చెందర్, గుండోజు పద్మ, సత్తమ్మ, కోరేపు గంగ, సాధేఖా భాను, జడగల శ్రీనివాస్, సాధానందం తదితర కార్యకర్తలు, కోచింగ్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎఫ్‌ఎల్‌ఎన్ పేరుతో అధికారులు, పర్యవేక్షణ టీంల ఒత్తిడి తగ్గించాలి!

**జమ్మికుంట సెప్టెంబర్ 24 పీపుల్స్ డైరీ.**
ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులపై ఎఫ్.ఎల్.ఎన్ పేరుతో అధికారులు, పర్యవేక్షణ టీమ్‌లు వేస్తున్న ఒత్తిడిని తగ్గించాలని డీ.టీ.ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి, చకినాల రామ్‌మోహన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తొలిమెట్టు (ఎఫ్.ఎల్.ఎన్) కార్యక్ర మంలో భాగంగా ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు కనీస సామర్థ్యాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు బోధన కొనసాగించాల్సి ఉంది. అయితే విద్యార్థులు కనీస సామర్థ్యాలు సాధించలేకపోవడానికి అనేక కారణాలు ఉంటాయి. సరిపడా తరగతి గదులు లేకపోవడం, మౌలిక సదుపాయాలు లేకపోవడం, సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడం, విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు రాకపోవడం, తల్లిదండ్రులు ఇంటి వద్ద పిల్లల చదువుపై శ్రద్ధ చూపకపోవడం వంటి కారణాల నేపథ్యంలో కనీస సామర్థ్యాలు రాకపోవడానికి ఉపాధ్యాయులను మాత్రమే దోషులుగా నిలబెట్టడానికి ప్రయత్నం జరుగుతున్నట్లుగా డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీ.టీ.ఎఫ్) భావిస్తోంది.

గత విద్యా సంవత్సరం నుంచి పాఠశాలల్లో ఎఫ్.ఎల్.ఎన్ పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయులను టీమ్‌లుగా ఏర్పరచి, ప్రాథమిక పాఠశాలల్లో బోధనను పర్యవేక్షించి, ఉపాధ్యాయులకు తగిన సలహాలు–సూచనలు ఇవ్వడం కోసం ఫ్రెండ్లీ అడ్వైజరీ టీమ్‌లుగా పిలుస్తూ రాష్ట్రవ్యాప్తంగా పర్యవేక్షణ జరిపిస్తున్నారు. అంతేకాకుండా ఈ విద్యా సంవత్సరం నుంచి ఈ టీమ్‌లకు అదనంగా ప్రతి జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా ఎఫ్.ఎల్.ఎన్ సెల్ ఏర్పాటు చేశారు.

కొందరు పర్యవేక్షణ అధికారులు, టీమ్‌లలో ఉన్న కొందరు ఉపాధ్యాయులు సాటి ఉపాధ్యాయులపై పర్యవేక్షణ పేరుతో అజమాయిషీ చేస్తున్నారని, టీమ్ లీడర్లు, టీమ్ మెంబర్లు ఉపాధ్యాయులకు సరైన సలహాలు–సూచనలు చేయాలని, అవసరమైతే వారు వెళ్లిన పాఠశాలలో తరగతి గది బోధన చేయాలని, వారి అనుభవంలోని బెస్ట్ ప్రాక్టీస్‌ను ఉపాధ్యాయులకు తరగతి గది బోధన ద్వారా తెలియజేయాలని డీ.టీ.ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోరారు.

ఇట్టి విషయమై జిల్లా విద్యాశాఖ అధికారి MEOలకు, SCH-HVలకు, పర్యవేక్షణ అధికారులకు, టీమ్ లీడర్లు మరియు సభ్యులకు ప్రత్యేకంగా సూచనలు చేయాలని, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులపై ఒత్తిడిని తగ్గించాలని డీ.టీ.ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి, ప్రధాన కార్యదర్శి చకినాల రామ్‌మోహన్ డిమాండ్ చేశారు.

# తాళ్ల మల్లేశం కుటుంబాన్ని పరామర్శించిన ఎర్రబెల్లి ప్రదీప్ రావు



**కాశిబుగ్గ, సెప్టెంబర్ 24 ( పీపుల్స్ డైరీ) :** వరంగల్ చార్ బౌలి ప్రాంతానికి చెందిన లెర్నర్స్ ల్యాండ్ స్కూల్ మరియు తాళ్ల పద్మావతి విద్యా సంస్థల అధినేత తాళ్ల మల్లేశం కుటుంబాన్ని గురువారం బిజెపి రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు పరామర్శించారు. ఇటీవల మరణించిన తాళ్ల మల్లేశం చార్ బౌలిలోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరితోపాటు ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బైరి మురళీ కృష్ణ, ఉపాధ్యక్షులు గడల కుమార్, కందిమల్ల మహేష్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కూచన క్రాంతి, కోమాకుల నాగరాజు, రత్నం కృష్ణ కిషోర్, ముత్తినేని లక్ష్మణ్, మరుముల్ల ప్రవీణ్, మంతెన అనిత స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్రమహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారదకు ఘన సన్మానం...



**ఇల్లంతకుంట, సెప్టెంబర్ 24 పీపుల్స్ డైరీ :** హైదరాబాద్ బుద్ధ భవన్‌లో రెండవసారి తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్‌గా నేరెళ్ల శారద పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా, వారిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేసి శాలువాతో సన్మానం చేసి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం మెమొంటో మరియు ముత్యాల తలంబ్రాలు చైర్మెన్ రామారావు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి మేక మల్ల అశోక్, మడిపల్లి గ్రామ సర్పంచ్ మేకమళ్ళ తిరుమల వెంకటేష్, ఏ ఏం సి డైరెక్టర్ ఎగ్గేటి సదానందం తదితరులు పాల్గొన్నారు.

# సాయి వర్షినికి సీపీ అభినందనలు

- ఇండియన్ సాఫ్ట్‌బాల్ టీంకు ఎంపికైన సాయి వర్షిని
- భారత జట్టు తరుపున అండర్ 15 ఆసియా కప్ లో ప్రాతినిధ్యం




**పీపుల్స్‌డైరీ–హనుమకొండ :** ఇండియన్ సాఫ్ట్ బాల్ టీంకు ఎంపికైన క్రీడాకారిని వేల్పుల సాయి వర్షిని నీ నగర పోలీస్ కమిషనర్ శ్వేత అభినందిం చారు. తెలంగాణ రాష్ట్ర సాఫ్ట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ పిల్లి సాంబశివరావు ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ తాబేటి రాజేందర్, ఉపాధ్యక్షులు పెరుమాండ్ల సాంబమూర్తి, కోచ్ పోలేపాక వినయ్ ఆధ్వర్యంలో హెడ్ క్వార్టర్స్ లోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం మర్యాదపూర్వకంగా సీపీని కలిశారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ.. ఇండియన్ టీంకు సాయి వర్షిని ఎంపిక కావడం అభినందనీయమని కొనియాడారు. సాయివర్షినినీ క్రీడాకారిణిగా ఎదిగేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించడం ప్రశంసనీయమని అన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు సాయి వర్షిని గురించి సీపీకి వివరించారు. హన్మకొండ జిల్లా కేంద్రంలోని అనిల్, సుజాత దంపతుల కూతురు సాయి వర్షిని నగరంలోని గ్రీన్ వుడ్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్నారని తెలిపారు. చిన్నప్పటినుంచే తల్లిదండ్రులు తమ కూతురు సాయి వర్షిణి అంతర్జాతీయ క్రీడాకారిణిగా ఎదిగేందుకు తమ వంతు ప్రోత్సాహాన్ని అందించారని తెలిపారు. చైనాలో అక్టోబర్ 12 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న 5వ అండర్ 15 ఉమెన్స్ సాఫ్ట్బాల్ ఆసియా కప్ 2026 పోటీల్లో సాయి వర్షిని పాల్గొననున్నారని తెలిపారు. సిపి ని కలిసిన వారిలో సాయి వర్షిని తండ్రి అనిల్, అసోసియేషన్ ప్రతినిధులు, కోచ్ ఉన్నారు

# నిరుపేద కుటుంబానికి అండగా గౌతమ్ బుద్ధ సేవా సమితి

- మానవత్వంతో ముందుకొచ్చిన సేవా సమితి సభ్యులు
- అంత్యక్రియల కోసం రూ.5 వేల ఆర్థిక సాయం



**దమ్మపేట, సెప్టెంబర్ 24 (పీపుల్స్ డైరీ) :** మానవత్వమే మహోన్నత సేవ అనే నినాదంతో గౌతమ్ బుద్ధ సేవా సమితి సభ్యులు మరోసారి తమ సేవా గుణాన్ని చాటుకున్నారు. మందలపల్లి గ్రామానికి చెందిన రాయల వెంకటేశ్వరరావు గురువారం మృతి చెందడంతో విషయం తెలుసుకున్న గౌతమ్ బుద్ధ సేవా సమితి సభ్యులు వెంటనే స్పందించి, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాయల వెంకటేశ్వరరావు మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో ఉన్న సమయంలో గౌతమ్ బుద్ధ సేవా సమితి సభ్యులు పాలడుగుల అబ్బులు, ఎస్కే అజీమ్, రొయ్యల కుమార్ అక్కడికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి బాధలో తాము కూడా భాగస్వాములమని భరోసా కల్పించారు.

**దహన సంస్కారాల కోసం రూ.5 వేల సాయం**

మృతుడి కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, దహన సంస్కారాల నిర్వహణకు తమవంతు సహాయంగా రూ.5,000 నగదు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆపద సమయంలో కుటుంబానికి అండగా నిలిచి, మానవత్వాన్ని చాటుకున్న గౌతమ్ బుద్ధ సేవా సమితి సభ్యుల సేవా తీరును స్థానికులు అభినందించారు.

ఈ కార్యక్రమంలో పాలడుగుల అబ్బులు, ఎస్కే అజీమ్, రొయ్యల కుమార్ పాల్గొని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఆపదలో ఉన్న కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచిన సేవా సమితి సభ్యుల మానవతా దృక్పథాన్ని పలువురు ప్రశంసించారు.